
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



జగిత్యాల
జిల్లా వార్తలు

5★★

సోమవారం 1 డిసెంబరు 2025

అతివలే కీలకం



- పురుషుల కన్నా 28,722 మంది అధికంగా మహిళా ఓటర్లు
- అభ్యర్థుల ఎంపిక, అతివల ఓట్లపై పార్టీల దృష్టి
- జిల్లాలో మొత్తం ఓటర్లు 6,07,263
- మహిళలు 3,17,988, పురుషులు 2,89,266

జగిత్యాల, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ ఎన్నికల్లో గెలుపోటములు నిర్ణయించే శక్తిగా మహిళలు నిలవనున్నారు. మొత్తం ఓటర్లలో పురుషుల కన్నా 28,722 మంది మహిళా ఓటర్లు ఎక్కువగా ఉన్నారు. దీంతో అభ్యర్థులు అతివల ఓట్లు రాబట్టుకోవడంపై ప్రత్యేక దృష్టి సారించారు. జిలాలోని అన్ని మండలాల్లో మహిళా ఓటర్లే అధికంగా ఉన్నారు. హోరాహోరీగా సాగనున్న సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికల్లో మహిళల ఓట్లు కీలకంగా మారాయి. దీంతో అన్ని పార్టీల అభ్యర్థులు ఆమె ఆశీస్సులపై దృష్టి పెడుతున్నారు.

●బరిలోనూ ప్రాధాన్యం..

యాభై శాతం రిజర్వేషన్లతో అతివలకు రాజకీయాల్లో చక్రం తిప్పే అవకాశం దక్కింది. గతంతో పోలిస్తే ఈసారి మహిళలకు ఎక్కువ సీట్లు రిజర్వ్ అయ్యాయి. మొత్తం 385 గ్రామ పంచాయతీలు, 3,536 వార్డు సభ్యుల స్థానాలకు గాను 192 జీపీల్లో సర్పంచ్ అభ్యర్థులుగా మహిళలే బరిలోకి దిగనున్నారు. ఇక వార్డుల్లో 1,768 స్థానాలు మహిళలకు రిజర్వు అయ్యాయి. మిగిలిన ప్రాంతాల్లోనూ బలమైన మహిళా నేతలు ఉంటే వారినే పోటీకి దింపే అవకాశం ఉంది. తద్వారా ఓటర్లుగానే కాకుండా అభ్యర్థులుగానూ అతివలకు ప్రాధాన్యత దక్కనుంది.

●మహిళా ఓటర్లపై నజర్

గ్రామ పంచాయతీ ఎన్నికలు మహిళలే ప్రాధాన్య తగా జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో రాజకీయ పార్టీల నాయకులు మహిళలకు రిజర్వ్ అయిన సర్పంచ్ స్థానాలు, వార్డు సభ్యుల స్థానాలను లెక్కించే పనిలో నిమగ్నమయ్యారు. రిజర్వ్‌డ్ స్థానాల్లో తాము మద్దతు ఇచ్చే మహిళా అభ్యర్థులను పోటీకి దింపాలని వ్యూహరచన చేస్తున్నారు. అన్ని పార్టీలు ఇలాగే ఆలోచిస్తుండడంతో రాజకీయాలపై ఆసక్తి ఉన్న మహిళలకు మంచి అవకాశాలు దక్కను న్నా యి. పార్టీల్లో చురుకైనా మహిళా నాయకులతో పోటీ చేయించడంపై నాయకులు, మహిళా ఓటర్లను ఆక ట్టుకు నేందుకు అభ్యర్థులు యత్నాలు ప్రారంభించారు.

●ఆశావహుల ప్రయత్నాలు..

పోటీదారుల విజయావకాశాల్ని మార్చగలిగేలా సత్తా మహిళా ఓటర్లకు ఉండడంతో వారిని ఆకట్టుకు నేందుకు చీరలు, ఇతర బహుమతులను పంచేం దుకు ఆశావహులు తమ వంతు ప్రయత్నాలు చేస్తున్నారు. ఇందిరమ్మ చీరల పంపిణీ, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, గృహజ్యోతి, బ్యాంకు లింకేజీ రుణాల వడ్డీ రాయితీ తదితర మహిళ సంబంధిత పథకాలతో తమే అతివలు పట్టం కడుతారని కాంగ్రెస్ శ్రేణులు భావిస్తున్నాయి. చట్ట సభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ బిల్లును ఆమోదింపజేసిన విషయాన్ని మహిలలకు తెలుపడంతో పాటు వారిని ఆకట్టుకునేందుకు బీజేపీ, మహిళా సంక్షేమం కొరకు కేసీఆర్ కిట్, కల్యాణ లక్ష్మీ తదితర పథకాలను అమలు చేయడం ద్వారా మహిళలకు పెద్దపీట వేశామని బీఆర్ఎస్ శ్రేణులు ప్రచారం చేస్తూ ఓట్లను అభ్యర్థిస్తున్నారు. మహిళా ఓట్లను గంప గుత్తాగా ప్రసన్నం చేసుకోవడానికి మహిళా సంఘాల వారీగా చీరలు, కుట్టుమిషన్స్, వంట పాత్రలు, ఇతర సామాగ్రి తదితర నిత్యం ఉపయోగించుకునే వాటిని ఇచ్చేందుకు అభ్యర్థులు ప్రయత్నాలు చేస్తున్నారు.

జిల్లాలో మండలాల వారీగా ఓటర్లు ఇలా..

మండలం	పురుషులు	స్త్రీలు	ఇతరులు	మొత్తం
బీర్‌పూర్	8,472	9,266	0	17,738
బీమారం	8,307	9,270	0	17,577
బుగ్గారం	8,423	8,924	0	17,347
ధర్మపురి	17,170	18,218	1	35,389
ఎండపల్లి	11,790	12,286	1	24,077
గొల్లపల్లి	19,118	20,539	1	39,658
ఇబ్రహీంపట్నం	14,565	16,618	0	31,383
జగిత్యాల రూరల్	21,912	24,106	2	46,020
జగిత్యాల	4,601	5,126	0	9,727
కథలాపూర్	17,761	19,963	0	37,724
కొడిమ్యాల	18,568	19,854	0	38,422
కోరుట్ల	14,723	16,520	0	31,243
మల్యాల	19,150	21,155	2	41,103
మల్లాపూర్	19,269	21,834	0	41,103
మేడిపల్లి	11,320	12,931	0	24,251
మెట్‌పల్లి	17,227	19,638	1	36,866
పెగడపల్లి	17,531	18,518	0	35,869
రాయికల్	18,554	20,858	0	39,412
సారంగపూర్	9,776	10,690	0	20,466
వెల్గటూరు	11,209	11,474	1	22,684
మొత్తం	2,89,266	3,17,988	9	6,07,263



మలి విడతలో తొలిరోజు 171 సర్పంచ్ నామినేషన్లు



బీర్‌పూర్ నామినేషన్ దాఖలు చేయడానికి క్యూకట్టిన అభ్యర్థులు

జిల్లాలో మలి విడతలో 144 పంచాయతీలకు ఎన్నికలు జరగనుండగా ఆదివారం సర్పంచ్ స్థానాలకు 171 నామినేషన్లు వచ్చాయి. 1,276 వార్డు స్థానాలకు గాను 238 నామినేషన్లు దాఖలయ్యాయి. రెండో విడత నామినేషన్లను మంగళవారం సాయంతం 5 గంటల వరకు స్వీకరించనున్నారు.

మండలం	సర్పంచ్‌ల	నామినేషన్లు	వార్డులు	నామినేషన్లు
జగిత్యాల	5	9	50	11
జగిత్యాల రూరల్	29	36	268	34
రాయికల్	32	39	276	45
సారంగపూర్	18	18	144	29
బీర్‌పూర్	17	17	136	30
మల్యాల	19	19	186	48
కొడిమ్యాల	24	33	216	41
మొత్తం	144	171	1,276	238

తొలి విడత సర్పంచ్ స్థానాలకు 848 నామినేషన్లు

- వార్డు స్థానాలకు 2,572 నామినేషన్లు

జగిత్యాల, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో తొలివిడతలో 122 గ్రామ పంచాయతీ ఎన్నికలకు సర్పంచ్ స్థానాలకు 848, వార్డు మెంబర్ స్థానాలకు 2,572 నామినేషన్లు వచ్చినట్లు ఆదివారం కలెక్టర్ సత్యప్రసాద్ ప్రకటించారు. మేడిపల్లి మండలం విలయతాబాద్ గ్రామ పంచాయతీ లోని ఒకటో వార్డుకు గడువు ముగిసే సరికి ఎలాంటి నామినేషన్ దాఖలు కాలేదు.

మండలం	సర్పంచ్‌లు	నామినేషన్లు	వార్డులు	నామినేషన్లు
బీమారం	13	87	118	271
ఇబ్రహీంపట్నం	17	99	162	314
కథలాపూర్	19	131	360	472
కోరుట్ల	15	108	152	372
మల్లాపూర్	23	180	220	474
మేడిపల్లి	12	82	120	266
మెట్‌పల్లి	23	161	212	403
మొత్తం	122	848	1,172	2,572

ఎన్నికల కోడ్ ముగిసే వరకు ప్రజావాణి రద్దు

జగిత్యాల, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో ప్రతీ సోమవారం జరిగే ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్ విడుదైలన నేపథ్యంలో సమస్య పరిష్కారం కోసం ప్రజల నుంచి వినుతులను స్వీకరించే ప్రజావాణి కార్యక్రమ్మా రద్దు చేసినట్లు పేర్కొన్నారు. ఎన్నికల కోడ్ ముగిసే వరకు ప్రజావాణి కార్యక్రమం ఉండదన్నారు.

శ్రీరాంసాగర్‌కు స్వల్పంగా ఇన్‌ఫ్లో

జగిత్యాల, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్‌లోకి ఎగువ ప్రాంతాల నుంచి ఆదివారం స్వల్పంగా నీరు వస్తోంది. దీంతో డ్యామ్‌లో నీరు నిలకడగా ఉంది. ఎగువ ప్రాంతం నుంచి ప్రాజెక్టులోకి 688 క్యూసెక్కుల వరద వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు నుంచి తాగు నీటి అవసరాల కోసం మిషన్ భగీరథ ద్వారా 231 క్యూసెక్కులు, ఆవిరి రూపంలో 457 క్యూసెక్కుల నీరు పోతోంది. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 80.501 టీఎంసీలు కాగా అంతే స్థాయి నీటి మట్టంతో ప్రాజెక్టు నిండుకుండలా ఉంది. ప్రాజెక్టులోకి ఈ యేడాది జూన్ 1వ తేదీ నుంచి ఇప్పటి వరకు 948.403 టీఎంసీల నీరు వచ్చి చేరగా, ప్రాజెక్టు నుంచి 880.689 టీఎంసీల నీరును దిగువకు వదిలారు.

బొమ్మెన సెర్ప్ కేంద్రంలో కొనుగోళ్లు పూర్తి

కథలాపూర్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : కథలాపూర్ మండలంలోని బొమ్మెనలో సెర్ప్ ఆధ్వర్యంలో కొనసాగుతున్న వరి ధాన్యం కొనుగోలు కేంద్రంలో ఆదివారంతో కొనుగోళ్లు పూర్తయినట్టు ఏపీఎం చిన్నరాజయ్య తెలిపారు. 165 మంది రైతుల నుంచి 8424 క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు చేసి రైస్‌మిల్లుకు తరించామని పేర్కొన్నారు. మిగిలిన కేంద్రాల్లో కొనుగోళ్లు వేగవంతంగా పూర్తి చేస్తున్నట్టు చెప్పారు. సిబ్బందికి ఎప్పటికప్పుడు సలహాలు, సూచనలు చేస్తున్నామని పేర్కొన్నారు.

గురుకుల విద్యార్థుల వన భోజనాలు

ఇబ్రహీంపట్నం, నవంబరు30(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఎస్సీ గురుకుల పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు ఆదివారం వనభోజనాలకు వెళ్లారు. యామాపూర్ గ్రామశివారులోగల మామిడి తోటలోకి వెళ్లి సహపంక్తి భోజనాలు చేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఉన్నారు.

●పెగడపల్లి: మండల కేంద్రంలోని ఎస్సీ బాలుర సంక్షేమ హాస్టల్ విద్యార్థులు ఆదివారం వన భోజనాలకు తరలివెళ్లారు. విద్యార్థులను మండల కేంద్రంలోని ఎల్లమ్మ ఆలయ దర్శనం చేయించడంతో పాటు మామిడితోటలో వన బోజనాలు చేశారు. కార్యక్రమంలో హాస్టల్ వార్డెన్ స్వామి పాల్గొన్నారు.

మోడల్‌స్కూల్ విద్యార్థుల ప్రతిభ

జగిత్యాలరూరల్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి):జగిత్యాల రూరల్ మండలం లోని కండ్లపల్లి మోడల్‌స్కూల్ విద్యార్థులు జగిత్యాల లో నిర్వహించిన వైజ్ఞానిక ప్రదర్శనలో అద్భుత ప్రదర్శన కనబరిచినట్లు ప్రిన్సిపల్ సరితాదేవి తెలిపారు. వ్యవసాయం- సుస్థిర అభివృద్ధి సీనియర్ విభాగంలో వి. వంశీ కృష్ణ రైతుల కోసం రూపొందించిన అగ్రి ఫిల్ అండ్ క్యారీ టూల్ లో రెండవస్థానంలో నిలిచారని, ఆరోగ్యం- పరిశుభ్రత జూనియర్ విభాగంలో సీహెచ్. మహాత్ పర్యావరణ సహిత ఔషధ సమయసారని లో ప్రతిభ కనబరిచి రెండోస్థానంలో నిలిచారని తెలిపారు. గ్రీన్ ఎనర్జీ విభాగంలో జూనియర్ విభాగంలో యాసర్ అబ్బాసీ, సీనియర్ విభాగంలో దినేష్ లు అద్భుత ప్రదర్శన కనబిరిచారని తెలిపారు. ఈసందర్భంగా విద్యార్థులను డీఇఓ రాము, ఎంఇఓ గంగాధర్, వైస్ ప్రిన్సిపల్ నాగేష్, ఉపాధ్యాయ బృందం అభినందించారు.

మున్సిపాలిటీలో అవినీతిపై విచారణ చేపట్టాలి



మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

మెట్‌పల్లి టౌన్, నవంబరు30(ఆంధ్రజ్యోతి): మెట్‌పల్లి మున్సిపాలిటీలో జరుగుతున్న అవినీతిపై విజిలెన్స్ విచారణ చేపట్టాలని బీజేపీ పట్టణ అధ్యక్షుడు బొడ్ల రమేష్ డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ టౌన్ ప్లానింగ్, శానిటేషన్, రెవెన్యూ శాఖలో జరుగుతున్న అక్రమాలు అంతా ఇంతా కాదన్నారు. పట్టణంలో అక్రమ నిర్మాణాలు విచ్చలవిడిగా జరుగుతున్నా మున్సిపల్ కమిషనర్, టౌన్ ప్లానింగ్ అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. పెద్దసార్లు చెపితే, కిందిస్థాయి అధికారులు సెటిల్‌మెంట్ చేస్తున్నారని ఆయన విమర్శించారు. అలాగే రెవెన్యూ శాఖలో హౌసింగ్ కొలతలు, ఇంటి నెంబర్లు, పేరుమార్పిడి తదితర విషయాల్లో అక్రమాలు చోటు చేసుకుంటున్నా పట్టించుకునే నాథుడు లేదని పట్టణ ప్రజలు ఆవేదన చెందుతున్నారని వాపోయారు. మున్సిపల్ శాఖలో కొన్నేళ్లుగా కొంతమంది అధికారులు పాతుకుపోయారని, శానిటేషన్‌లో డీజిల్, పెట్రోల్, బ్లీచింగ్ పౌడర్ తదితర వాటిల్లో అవినీతిమయంగా మారిందన్నారు. ఈ సమావేశంలో పట్టణ ప్రధాన కార్యదర్శి సుంకేటి విజయ్, ఉపాధ్యక్షుడు బొడ్ల నగేష్, కోశాధికారి తల్లోజి భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

నామినేషన్ కేంద్రాల తనిఖీ



నామినేషన్ పత్రాలు తనిఖీ చేస్తున్న రాష్ట్ర వ్యయ పరిశీలకులు మనోహర్

జగిత్యాలరూరల్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల రూరల్ మండలంలోని చల్‌గల్ గ్రామపంచాయతీ కార్యాలయంలో నిర్వహిస్తున్న సర్పంచ్, వార్డు సభ్యుల నామినేషన్ల స్వీకరణ కేంద్రాన్ని రాష్ట్ర ఎన్నికల వ్యయ పరిశీలకులు మనోహర్ తనిఖీ చేశారు. ఎలాంటి తప్పిదాలు లేకుండా ఎన్నికల ప్రక్రియను నిర్వహించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

●జగిత్యాల మండలం బాలపల్లి గ్రామపంచాయితీ కార్యాల యంలో నిర్వహిస్తున్న సర్పంచ్, వార్డు సభ్యుల నామినేషన్ల స్వీకరణ కేంద్రాలను డీపీఓ తనిఖీ చేశారు.

●జగిత్యాల మండలం మోతె, తిప్పన్నపేట, ధరూర్ నామినేషన్ స్వీకరణ కేంద్రాలను డీఆర్‌డీఓ రఘువరణ్, డీపీఓ రేవంత్ లు తనిఖీ చేశారు. నామినేషన్ సెంటర్ వద్ద హెల్ప్ డెస్క్ అందుబాటులో ఉంచాలని, అవసరమైన వారికి సహకారం అందించాలని సూచించారు. వీరి వెంట ఎంపీడీవోలు విజయలక్ష్మీ, రమాదేవి, ఎంపీవోలు రవిబాబు, వాసవి ఉన్నారు.

రోడ్డున పడిన బతుకులు..

- కొండగట్టు అగ్ని ప్రమాదంలో రూ.కోటికిపైగా నష్టం
- బాధిత కుటుంబాలకు అండగా ఉంటాం
- మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

6లో..



కొండగట్టులో దగ్ధమైన దుకాణాలు

ఎస్టీయూ బలోపేతానికి కృషి చేస్తాం

-ఎస్టీయూ రాష్ట్ర బాధ్యులు

జగిత్యాల అగ్రికల్చర్, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): రాష్ట్రోపాధ్యాయ సంఘం (ఎస్టీయూ) బలోపేతానికి కృషి చేస్తామని ఆ సంఘం నాయకులు పేర్కొన్నారు. రాష్ట్రోపాధ్యాయ సంఘంలో వివిధ హోదాల్లో సేవలందించిన మచ్చ శంకర్‌ను రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శిగా, సీర్ణంచ రవీందర్‌ను రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా, శనిగరపు రవిని రాష్ట్ర కార్యదర్శిగా నియమిస్తూ రాష్ట్ర అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు సదానందగౌడ్, జుట్టు రాజేందర్‌లు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు భైరం హరికిరణ్, పాలెపు శివరామకృష్ణ నూతన రాష్ట్ర కమిటీ బాధ్యులు హర్షం వ్యక్తం చేస్తూ శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్ర నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర కమిటీలో జిల్లా నాయకుల ఎన్నికతో ఉపాధ్యాయ సంక్షేమం, సంఘ బలోపేతం, సంఘ కార్యకలాపాల విస్తరణ మరింత వేగం పొందుతుందన్నారు. ఈ సందర్భంగా నూతనంగా నియమితులైన రాష్ట్ర బాధ్యులు మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని, జిల్లాలో సంఘ బలోపేతానికి తోడ్పడుతామని తెలిపారు. తమ నియామకానికి సహకరించిన రాష్ట్ర, జిల్లా బాధ్యులకు వారు కృతజ్ఞతలు తెలిపారు.

ఎన్నికల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు



నామినేషన్ కేంద్రంలో అధికారులకు సూచనలు ఇస్తున్న కలెక్టర్ సత్యప్రసాద్

జగిత్యాల రూరల్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : పంచాయతీ ఎన్నికలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ సత్యప్రసాద్ అధికారులను ఆదేశించారు. సారంగాపూర్ మండలంలోని సారంగాపూర్, రేచపల్లి, లక్ష్మీదేవిపల్లి గ్రామాల్లో నామినేషన్ ప్రక్రియను ఆదివారం కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ పంచాయతీ ఎన్నికలు సమర్థవంతంగా నిర్వహించాలని అన్నారు. 144 గ్రామాలకు, 1276 వార్డులకు రెండో విడత ఎన్నికల నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. గెజిట్ నోటిఫికేషన్ ప్రకారం రిజర్వేషన్ల వివరాలు నోటీస్ బోర్డుపై సక్రమంగా ప్రదర్శించబడ్డాయా అనే విషయాన్ని జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఎన్ని నామినేషను సీంవకరించ బడ్డాయి, నామినేషన్ పత్రాలను ఎంత మంది అభ్యర్థులు తీసుకున్నారనే వివరాలను సంబంధిత అధికారుల నుంచి కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఎలాంటి పొరపాట్లు జరగకుండానామినేషన్ ప్రకియను నిర్వహించాలని నామినేషన్ దరఖాస్తూ ఫారాలు తీసుకున్న వారి వివరాలను రిజిష్టర్‌లో నమోదు చేయాలన్నారు. నామినేష్ ప్రకియ చట్టబద్ధంగా, ఎవరికి ఇబ్బందులు లేకుండా పూర్తయ్యేలా అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. హెల్ప్ డెస్క్, పోలీస్ బందోబస్తు, సిబ్బంది సరిపడా ఉన్నారా అని ఆరా తీశారు. ప్రశాంత వాతవరణంలో ఎన్నికలు నిర్వహించాలన్నారు. ఎన్నికలకు సంబంధించి ఎలాంటి సందేహలు ఉన్నా అధికారులను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ వహిదోద్దిన్, ఎంపీడీవో సలీం, ఆర్ఐ వెంకటేష్ ఉన్నారు.

రేపు దివ్యాంగులకు క్రీడా పోటీలు

జగిత్యాల అగ్రికల్చర్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని స్థానిక మినీ స్టేడియంలో మంగళవారం అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా జిల్లాలోని దివ్యాంగులకు ఆటల పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా సంక్షేమ అధికారి డాక్టర్ భోనగిరి నరేష్ తెలిపారు. జూనియర్ విభాగంలో 18ఏళ్లలోపు వయస్సు గల వారికి, అలాగే సీనియర్ విభాగంలో 18 నుంచి 54ఏళ్లలోపు వయస్సు గల వారికి ఈ పోటీలు నిర్వహించబడునని తెలిపారు. జూనియర్, సీనియర్ విభాగాలకు చెందిన అంధులకు పరుగుపందెం, షాట్‌పుట్, చెస్‌పోటీలు, బధిరులకు పరుగుపందెం, షాట్‌పుట్, జవేలిన్ త్రో, శారీరక వికలాంగులకు జవేలీ త్రో, షాట్‌పుట్, క్యారంబోర్డు పోటీలు, మానసిక వికలాంగులకు పరుగుపందెం, షాట్‌పుట్ పోటీలు నిర్వహించబడునని తెలిపారు. ఈ పోటీలు ఉదయం 9గంటలకు పోటీలు ప్రారంభంఅవుతాయని తెలిపారు.

ప్రభుత్వం తెచ్చిన విద్యుత్ పాలసీ పచ్చి బూటకం

-మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్



మాట్లాడుతున్న మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్

జగిత్యాల టౌన్, నవంబరు30 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ సర్కారు తెచ్చిన విద్యుత్ పాలసీ పచ్చి బూటకమని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ విమర్శించారు. జిల్లా బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కొప్పుల ఈశ్వర్ మాట్లాడుతూ పవర్ ప్లాంట్‌లకు బీఆర్ఎస్ పార్టీ ఎప్పుడూ వ్యతిరేకం కాదని అన్నారు. ఇటీవల కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న స్కామ్‌లను ఎండగడుతున్న హరీశ్‌రావు దిష్టిబొమ్మను దహనం చేయడాన్ని ఆయన ఖండించారు. దేశంలోనే అతిపెద్ద భూస్కాం బయటపడగా నేడు మరో రూ.50వేల కోట్ల పవర్ స్కాం వెలుగు చూసిందని ఆరోపించారు. ఒక్కో మెగావాట్‌కు కాస్ట్ యాదాద్రికి రూ.8.63 కోట్లు, భద్రాద్రికి రూ.9.74 కోట్లు మాత్రమే ఖర్చు చేసిందన్నారు. ఎన్టీపీసీ కూడా ఒక్కో మెగావాట్‌కు రూ, 12.23 కోట్లు వెచ్చించిందని అన్నారు.

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాడు యాదాద్రి థర్మల్ పవర్ ప్రాజెక్టులు మేము కడుతుంటే అవి దండుగా కట్టనే కట్టవద్దని అన్నాడని ఇప్పుడు ఎందుకు ముద్దు అంటున్నాడని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ విమర్శించారు. తక్కువ ధరకే కరెంట్ వస్తుంటే ఎక్కువ ఉత్పత్తి రేటుతో ప్లాంట్లు ఎందుకు ఏర్పాటు చేస్తున్నారని మండిపడ్డారు. ప్రభుత్వంపై వస్తున్న అవినీతి ఆరోపణలను రుజువు చేసుకోవాలి కానీ డైవర్షన్ పాలిటిక్స్ ఏంటని ప్రశ్నించారు. బీఆర్ఎస్ పార్టీ పవర్ ప్లాంట్‌లకు వ్యతిరుకం కాదని కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకుంటున్న విధానాలకు వ్యతిరేకమని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. ఈ విలేకరుల సమావేశంలో జడ్పీ మాజీ వైస్ చైర్మన్ హరిచరణ్‌రావు, ఉప్పుగండ్ల నరేందర్, బీఆర్ఎస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

నాలుగు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

కరీంనగర్ క్రైం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ రూరల్ మండలం దుర్శేడ్, మొగ్ధుంపూర్ గ్రామాల్లో ఇసుకను అక్రమంగా తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్లను ఆదివారం పట్టుకున్నామని కరీంనగర్ రూరల్ సీఐ ఎ నిరంజన్‌రెడ్డి తెలిపారు. మానేరు వాగు నుంచి ఇసుకను దొంగలించి కరీంనగర్‌లో విక్రయించేందుకు ట్రాక్టర్లలో తరలిస్తుండగా పట్టుకున్నామని సీఐ తెలిపారు. ట్రాక్టర్ డ్రైవర్లు అలవేని అనిల్, దాసరి నరేష్, గాజుల శివకృష్ణ, శ్రీరామోజు తిరుపతిపై కేసు నమోదు చేశామని తెలిపారు. ఎలాంటి అనుమతి లేకుండా ఇసుకను అక్రమంగా తరలిస్తే కఠినచర్యలు తప్పవని సీఐ నిరంజన్‌రెడ్డి హెచ్చరించారు.

లభ్యంకాని మృతుడి వివరాలు

జమ్మికుంట రూరల్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట మండలం శంభునపల్లి శివారులో లభించిన గుర్తు తెలియని యువకుడి మృతదేహం వివరాలు తెలియరాలేదు. క్లూస్ టీం మృతుడి శరీర భాగాల నుంచి శాంపిల్స్ సేకరించింది. డాగ్ స్క్వాడ్ మృతదేహం పడి ఉన్న ప్రాంతం మొత్తం తిరిగింది. హంతకులు మద్యం తాగిన ఆనవాళ్లు తప్ప మిగతా క్లూ వదిలిపెట్టలేదు. అన్ని పోలీస్ స్టేషన్లకు మృతుడి ఫొటోలు, వివరాలు పంపించినా ఫలితం లేదు. శంభునిపల్లికి గుంపుల క్రాస్ రోడ్, వావిలాల, తనుగుల గ్రామాల మీదుగా రాకపోకలు తప్ప ఇతర మార్గాలు లేవు. దీంతో పోలీసులు మూడు ప్రధాన రోడ్ల గుండా ఉన్న సీసీ కెమెరాల ఫుటేజీ ఆధారంగా వివరాలు సేకరిస్తున్నట్లు తెలిసింది. హంతకులు సెల్‌ఫోన్లు కూడా వెంట తెచ్చుకోనట్లు సమాచారం.


డాగ్‌స్క్వాడ్‌తో తనిఖీలు నిర్వహిస్తున్న సిబ్బంది

రేషన్‌బియ్యం కోసం ఆదివాసీల తిప్పలు



- చిన్నకొల్వాయిలో రేషన్‌షాపు లేక నాలుగు కిలోమీటర్ల నడక
- పట్టించుకోని అధికారులు, పాలకులు

బీర్‌పూర్, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్యం వచ్చి దశాబ్దాలు గడుస్తున్నా ఆదివాసీల పరిస్థితులు మాత్రం మారడం లేదు. బీర్‌పూర్ మండలంలోని చిన్నకొల్వాయి గ్రామంలో రేషన్‌దుకాణం లేక ఆదివాసీలు ఇబ్బందులు పడుతున్నారు. చిన్నకొల్లాయి ఒకప్పుడు కొల్వాయికి అనుబంధ గ్రామంగా ఉండగా ప్రస్తుతం నూతన గ్రామ పంచాయతీగా ఏర్పడింది. ఈ గ్రామంలో 50 కుటుంబాలు ఉండగా 200 జనాభా ఉంది. వీరు ప్రతి నెల ప్రభుత్వం చౌకధరల దుకాణం ద్వారా అందించే బియ్యం కోసం సుమారు నాలుగు కిలోమీటర్ల దూరం కాలినడకన కొల్వాయి గ్రామానికి వెళ్లి తెచ్చుకుంటున్నారు. నాలుగు కిలోమీటర్లు నడవడమే కష్టం కాగా బియ్యాన్ని మోసుకొని పోవడం మరి ఇబ్బంది అవుతోందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


చిన్నకొల్వాయి గ్రామం

రేషన్‌షాపు ఏర్పాటు చేయాలి

-మాజీ సర్పంచ్ చిక్రం రవీందర్, చిన్నకొల్వాయి



మా గ్రామంలో ప్రత్యేక రేషన్ షాప్ ఏర్పాటు చేసి అంద రికీ రేషన్‌బియ్యం పంపిణీ చేయాలి. ఈ విషయ మై అనేక సార్లు అధికారులు, నాయ కుల దృష్టికి తీసుకెళ్లాం. ఎవరూ మా బాధలను పట్టించుకోవడం లేదు. ప్రతి నెల నాలుగు కిలోమీటర్ల దూరం నడి చి వెళ్లి రేషన్‌బియ్యం తెచ్చుకోవాల్సి వస్తోంది.

బియ్యం కోసం ఇబ్బంది పడుతున్నాం

-కొట్నాక గంగవ్వ, చిన్నకొల్వాయి



మేము నాలుగు కిలోమీటర్ల దూరం మేము నడవడమే కష్టంగా ఉంది. ఇంకా మా బియ్యాన్ని ఎలా మోసుకొని పోతాము. పెద్ద సార్లు మా గోస చూసి మా గూడెంలో రేషన్‌దుకాణం పెట్టి బియ్యం తీసుకునేటట్టు చేయాలి

ప్రమాదవశాత్తు నీటిలో మునిగి వ్యక్తి మృతి

మంథనిరూరల్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అరెంద వద్ద గోదావరి నదిలో ప్రమాదవశాత్తు నీటిలో మునిగి పంచిక సదయ్య (40) అనే వ్యక్తి ఆదివారం మృతి చెందాడు. వెంకటాపూర్ గ్రామానికి చెందిన సదయ్యకు మల్లన్న బోనాలు ఉండటంతో బంధువులతో కలిసి గోదావరి నది స్నానానికి వెళ్లాడు. స్నానం చేసిన అనంతరం ఇసుక కోసం తిరిగి గోదావరి నదిలోకి వెళ్లగా ప్రమాదవశాత్తు నీటిలో మునిగిపోయాడు. అతని వెంట వెళ్లిన బంధువులు అతని రక్షించడానికి చేసిన ప్రయత్నాలు విఫలమయ్యాయి. గోదావరి నదిలో గల్లంతయిన సదయ్య కోసం సుమారు రెండు గంటల పాటు గాలించిన అనంతరం మృతదేహన్ని గ్రామస్థులు వెలికితీశారు. సదయ్యకు భార్య మమత, ఇద్దరు కుమారులు ఉన్నారు.

ద్విచక్ర వాహనాలు ఢీకొని ఇద్దరికి గాయాలు

శంకరపట్నం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): శంకరపట్నం మండలం కేశవపట్నం ప్రభుత్వ పాఠశాల ఎదురుగా రెండు ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీకొని ఇద్దరు గాయపడిన సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం హుజూరాబాద్‌కు చెందిన నిమ్మటూరి సాయికృష్ణ, అతని భార్య రమతో కలిసి హుజూరాబాద్ నుంచి కరీంపేటకు వెళ్తున్నాడు. కరీంపేట నుంచి కేశవపట్నం వైపు వస్తున్న ద్విచక్ర వాహనం ఎదురెదురుగా ఢీ కొన్నాయి. ఈ ప్రమాదంలో సాయికృష్ణ చేతికి, పక్కటెముకలకు గాయాలయ్యాయి. అతని భార్య కుడికాలుకు గాయమైంది. గమనించిన స్థానికులు 108 వాహనంలో హుజూరాబాద్ ఏరియా ఆస్పత్రికి తరలించారు.

టిప్పర్ కిందపడి యువకుడి మృతి

గంగాధర(రామడుగు), నవంబరు 30(ఆంధ్రజ్యోతి): రామడుగు మండల కేంద్రంలో టిప్పర్ వెనక టైర్లు మీదనుంచి వెళ్లగా ఓ యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. ఎస్సై రాజు తెలిపిన వివరాల ప్రకారం.. రామడుగు మండల కేంద్రానికి చెందిన మామిడి వెంకటేష్(39) అనే యువకుడు తన టిప్పర్ బ్రేక్ డౌన్ కావడంతో రోడ్డు పక్కన నిలిపి మరమ్మతులు చేస్తున్నాడు. ఈక్రమంలో వెంకటేశ్ తమ్ముడు మామిడి నరేష్ టిప్పర్‌ను ముందుకు నడిపించాడు. ఈక్రమంలో టిప్పర్ వెనక టైర్లు వెంకటేశ్‌పై నుండి వెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడు వెంకటేష్ తండ్రి నర్సయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రోడ్డునపడిన బతుకులు..

- కొండగట్టు అగ్నిప్రమాదంలో సర్వం కోల్పోయి.. - కట్టుబట్టలతో బాధితులు - రూ.కోటికిపైగా నష్టం

వారంతా బొమ్మలు అమ్ముకొని జీవించే సామాన్యులు.. సమ్మక్కసారక్క జాతర రానుండడంతో కొండగట్టుకు భక్తుల రాక ఎక్కువగా ఉంటుందని, తమ వ్యాపారం కాస్తా కలిసివస్తుందని.. అప్పులు చేసి లక్షల రూపాయల విలువైన బొమ్మలు, ఆట వస్తువులు, పూజాసామగ్రి తెచ్చుకున్నారు. దుకాణం అంతా నింపుకోగా శనివారం అర్ధరాత్రి అగ్నిప్రమాదంతో వారి ఆశలు ఆవిరయ్యాయి. వస్తువులతో పాటు ఇంటి సామగ్రి సర్వం బుగ్గి అయ్యింది. బాధిత కుటుంబాలు రోడ్డునపడి కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

మల్యాల, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దిగువ కొండగట్టులోని అభయాంజనేయస్వామి విగ్రహం ముందు గల దారికి ఇరువైపుల ప్రైవేట్ వ్యక్తుల వద్ద అనేక మంది స్థలం అద్దెకు తీసుకొని అనేక దుకాణాలు ఏర్పాటు చేసుకొని ఉపాధి పొందుతున్నారు. శనివారం రాత్రి సమీపంలోని విద్యుత్ స్తంభం వద్ద నుంచి వెళ్లిన తీగలు షార్ట్‌సర్క్యూట్‌కు గురికావడంతో మొదట అక్కడ గల ఒక్క దానికి మంటలు వ్యాపించి నిమిషాల వ్యవధిలోనే ఇరవైకి పైగా దుకాణాలు మంటల్లో చిక్కుకున్నాయి. అందులో ప్లాస్టిక్ వస్తువులే అధికంగా ఉండడంతో మంటలు దట్టంగా చెలరేగాయి. దీంతో దుకాణాల్లో నివాసముంటున్న కుటుంబాలు కట్టుబట్టలతో బయటకు పరుగులు తీయగా కళ్లెదుటే సర్వం బుగ్గి కావడంతో వారి రోదనలు మిన్నంటాయి.

● ఆలస్యంగా వచ్చిన ఫైర్ ఇంజన్..

ప్రమాదం జరిగిన వెంటనే జగిత్యాలలోని ఫైర్ ఇంజన్‌కు సమాచారం అందించగా సుమారు గంటన్నర వరకు రాలేదని బాధితులు తెలిపారు. సమాచారం అందించినప్పుడు కేవలం మూడు దుకాణాలకు మాత్రమే మంటలు వ్యాపించాయన్నారు. ఫైరింజన్ వచ్చే వరకు మొత్తం ఇరవైకి పైగా దుకాణాలు కాలి బూడిదయ్యాయి. దుకాణాల్లో నివాసముంటున్న కుటుంబాలకు చెందిన ఇంటి సామగ్రి, కుట్టు మిషన్లు, ల్యాప్‌ట్యాప్‌లు, బీరువాలు, బంగారం, నగదు తదితర వస్తువులు మంటల్లో దగ్ధం అయ్యాయి. ఫైర్ ఇంజన్ సకాలంలో చేరుకుంటే ఇంత నష్టం జరిగేది కాదని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

● షార్ట్ సర్క్యూట్‌తో ప్రమాదం..

అగ్నిప్రమాదం షార్ట్ సర్క్యూట్‌తోనే జరిగినట్లు అధికారులు నిర్ధారించారు. షార్ట్ సర్క్యూట్‌తో ఇనుప రేకులు చిల్లులు పడగా తీగలు ముద్ద అయ్యాయి. సంఘటన స్థలాన్ని ట్రాన్స్‌కో వరంగల్ సీఈ అశోక్ పరిశీలించారు. బాధితులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. కాగా అగ్నిప్రమాదంలో కోటి నుంచి రెండు కోట్ల మేర ఆస్తి నష్టం జరిగినట్లు బాధితులు పేర్కొంటున్నారు. జాతర కోసం ఇటీవలే సామగ్రి తీసుకువచ్చామని ఇంతలోనే ప్రమాదం జరగడం తీరని వేదన మిగిల్చిందని బాధితులు అంటున్నారు.

● సర్టిఫికెట్లు బుగ్గి..

అగ్నిప్రమాదంలో కరీంనగర్‌లో ఇంజనీరింగ్ చివరి సంవత్సరం చదువుతున్న శ్వేత అనే విద్యార్థినికి చెందిన సర్టిఫికెట్లు కాలిపోయాయి. అలాగే అగ్నిప్రమాద వేడితో సమీపంలో గల దుకాణంలో గల అనిల్ అనే వ్యక్తికి చెందిన నలభై కోళ్లు బుగ్గి అయ్యాయి. అలాగే ఓ ఇళ్లు మంటలతో నల్లగా మారగా సమీప ఇళ్లల్లో వస్తువులు వేడికి చెడిపోయాయి. రెవెన్యూ అధికారులు నష్టం అంచనా వేస్తున్నారు.

● బాధితులకు ఆర్థికసాయం..

అగ్నిప్రమాదంతో సర్వం కోల్పోయిన అనేక కుటుంబాలకు కట్టు బట్టలే మిగిలాయి. బాధిత కుటుంబాలను ప్రస్తుతం అధికారులు సమీపంలో గల శ్రీనాథ్ రెసిడెన్సీలో బస కల్పించారు. రెవెన్యూ అధికారులు ఒక్కో కుటుంబానికి తక్షణ సాయంగా రూ.5వేల నగదు, 10కిలోల బియ్యం అందించారు. మరో రూ.15వేల సాయం సోమవారం అందించనున్నట్లు అధికారులు తెలిపారు.

బాధిత కుటుంబాలకు అండగా ఉంటాం

● మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

కొండగట్టులో జరిగిన అగ్నిప్రమాద బాధితులకు అండగా ఉంటామని రాష్ట్ర మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ తెలిపారు. ప్రమాద సంఘటన స్థలాన్ని మంత్రి లక్ష్మణ్‌కుమార్, ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంతో కలిసి పరిశీలించారు. బాధితులతో మాట్లాడి ప్రమాద ఘటన గురించి అడిగి తెలుసుకున్నారు. వారందరిని ఓదార్చారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ ఈ సంఘటన బాధకరం అని పేర్కొన్నారు. బాధిత కుటుంబాలను ఆదుకోవాలని కలెక్టర్‌ను కోరామని, ఆందోళన చెందవద్దని అన్నారు. ప్రభుత్వం తరుపున అండగా ఉంటామని, ఆధైర్యపడవద్దని మంత్రి తెలిపారు. బాధిత కుటుంబాలకు తక్షణ సాయం కింద రూ.20వేలతో పాటు సెర్ప్ ద్వారా వడ్డీ లేని రూ.5లక్షల వరకు రుణాలు అందించాలని అధికారులకు సూచిస్తామని తెలిపారు. షార్ట్ సర్క్యూట్ ద్వారా జరిగిన ప్రమాదం కాబట్టి విద్యుత్ శాఖ లక్ష రూపాయలు అందిస్తే చిరు వ్యాపారులంతా మళ్లీ షెడ్లు వేసుకునే అవకాశం ఉంటుందని అన్నారు. ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం మాట్లాడతూ బాధితులను పూర్తిగా ఆదుకుంటామన్నారు. వారి వెంట మాజీ మంత్రి టీ.జీవన్‌రెడ్డి ఉన్నారు.

● బీఆర్‌ఎస్ ఆర్థిక సహాయం

బాధిత కుటుంబాలకు బీఆర్‌ఎస్ పార్టీ తరుపున మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ రూ.5వేలు అందించారు. ఒక్కో కుటుంబానికి రూ.30లక్షలు పరిహారంగా అందించాలని డిమాండ్ చేశారు. మాజీ జడ్పీటీసీ కొండపల్కుల రామ్మోహన్‌రావు, మాజీ సర్పంచ్ బద్దం తిరుపతిరెడ్డి, విండో చైర్మన్ అయిల్నేని సాగర్‌రావు ఉన్నారు. ఈ ఘటనపై బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరా తీసి రవిశంకర్‌ను వివరాలు అడిగి తెలుసుకున్నారు.

● మంత్రి పొన్నం, కవిత విచారం

కొండగట్టు అగ్నిప్రమాదం ఘటనపై మంత్రి పొన్నం ప్రభాకర్, జాగృతి అధ్యక్షురాలు కవిత విచారం వ్యక్తం చేశారు. కలెక్టర్‌తో మాట్లాడి ఆదుకోవాలని కోరినట్లు మంత్రి పేర్కొన్నారు. చిరు వ్యాపారుల దుకాణాలు బుగ్గి అయి సర్వం కోల్పోవడం తన మనసు కలచివేసిందని కవిత ఒక ప్రకటనలో అన్నారు. మానవత దృక్పతంతో ప్రభుత్వం ఆదుకోవాలని కవిత కోరారు.


రోదిస్తున్న బాధితులు

● పెళ్లికి సిద్ధం చేసుకున్న బంగారం

పెళ్లికి సిద్ధం చేసుకున్న బంగారం అగ్నిప్రమాదంలో బుగ్గి అయినట్లు ఓ వ్యక్తి మంత్రి లక్ష్మణ్‌తో పేర్కొనడం అక్కడి వారందరిని కలచివేసింది. ఒక్కొక్కరూ తమ బాధలను చెబుతుంటే మంత్రి, ఎమ్మెల్యేలు చలించిపోయారు.

ఘటన స్థలాన్ని పరిశీలించిన కలెక్టర్

కొండగట్టులో జరిగిన అగ్నిప్రమాద ఘటన ప్రాంతాన్ని కలెక్టర్ సత్యప్రసాద్ పరిశీలించారు. ప్రమాద వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రమాదంపై పూర్తి నివేదిక అందించాలని తహసీల్దార్, ఇతర అధికారులను ఆదేశించారు. ప్రమాదంలో 25 దుకాణాలు పూర్తిగా, ఐదు దుకాణాలు పాక్షికంగా దగ్ధం అయినట్లు అధికారులు తెలిపారు. వారికి రూ.ఐదువేల చొప్పున సాయం అందించారు. ఆర్డీవో మధుసూధన్‌గౌడ్, తహసీల్దార్ వసంత, ఎంపీడీవో స్వాతి, ఎంపీవో ఆమని, ఆర్ఐ తిరుపతి, విద్యుత్ శాఖ అధికారులు ఉన్నారు.




బాధితులతో మాట్లాడుతున్న మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, ఘటనాస్థలాన్ని కలెక్టర్ సత్యప్రసాద్, బాధితులను ఓదారుస్తున్న మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్

దారి దోపిడీకి పాల్పడిన నిందితుల అరెస్టు


వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ రఘుచందర్

జగిత్యాల టౌన్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లా కేంద్రంలోని నిజామాబాద్ రోడ్డులో శనివారం అర్ధరాత్రి డీసీఎం డ్రైవర్ వద్ద నుంచి రూ. 22వేల నగదు, సెల్‌ఫోన్ ఎత్తుకెళ్లిన నిందితుల ముఠాను అరెస్టు చేసినట్లు జగిత్యాల డీఎస్పీ రఘుచందర్ తెలిపారు. ఆదివారం డీఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలను వెల్లడించారు. మంచిర్యాల జిల్లా నెన్నెల మండలం జెండా వెంకటపూర్‌కు చెందిన తాళ్లపల్లి నవీన్ అనే వ్యక్తి తన సొంత డీసీఎం వ్యాన్‌లో వడ్ల లోడ్‌ను నిజామాబాద్‌కు తీసుకెళ్లాడు. అక్కడ వడ్ల లోడ్‌ను దింపి స్వగ్రామానికి తిరిగి వస్తున్నాడు. ఈ క్రమంలో జగిత్యాల-నిజామాబాద్ జాతీయ రహదారిలోని ఓ పెట్రోల్ బంక్ వద్ద శనివారం అర్ధరాత్రి కాలకృత్యాల కోసం డీసీఎం వాహనాన్ని నిలిపాడు.

అదే సమయంలో ద్విచక్రవాహనంపై వచ్చిన జగిత్యాల పట్టణంలోని పెరకపల్లి రోడ్‌కు చెందిన ఎర్రం సాయి, గాంధీ నగర్‌కు చెందిన నక్క గణేష్‌తో పాటు మరో బాలుడు వాహన డ్రైవర్ నవీన్‌పై కర్రలతో దాడి చేశారు. అతడి వద్ద ఉన్న రూ. 22 వేల నగదు, సెల్‌ఫోన్ దొంగిలించి పారిపోయారు. నవీన్ ఫిర్యాదు మేరకు జగిత్యాల పట్టణ పోలీసు లు కేసు నమోదు చేసి నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. ఆదివారం మధ్యాహ్నం పెరకపల్లి రోడ్డు వద్ద నిందితు లను పట్టుకుని దొంగిలించిన సొత్తును స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ తెలిపారు. దొంగతనం జరిగిన 24 గంటల్లో నిందితు లను అరెస్టు చేసిన జగిత్యాల సీఐ కరుణా కర్, స్పెషల్ పార్టీ పోలీసులను డీఎస్పీ అభినందించారు.

మద్యం పట్టివేత

ఇల్లందకుంట, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సీతంపేటకు చెందిన సమ్మయ్య ఇంట్లో అక్రమంగా నిల్వ ఉంచిన మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో మద్యం అమ్ముతున్నారనే సమాచారం మేరకు తనిఖీ చేపట్టారు. 6,100 రూపాయల విలువైన మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు సదరు వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై క్రాంతికుమార్ తెలిపారు.

వీణవంక: మండలంలో వాహనాల తనిఖీ నిర్వహిస్తుండగా అక్రమంగా తరలిస్తున్న మద్యాన్ని పోలీసులు పట్టుకున్నారు. శ్రీరాములపేటకి చెందిన కురిమిండ్ల రవీందర్ ఏడు వేల రూపాయల విలువైన మద్యం తరలిస్తుండగా పట్టుకుని కేసు నమోదు చేసినట్లు వీణవంక ఎస్ఐ ఆవుల తిరుపతి తెలిపారు.

విద్యుదాఘాతంతో పాడి గేదె మృతి

గంభీరావుపేట, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని రామ చెరువు ప్రాంతంలో ప్రమాదవశాత్తు విద్యుదాఘాతంతో అదే గ్రామంలోని రైతు గంధ్యాడపు శంకర్‌కు చెందిన పాడి గేదె ఆదివారం మృత్యువాత పడింది. శంకర్ తన వ్యవసాయ పొలం వద్ద పాడి గేదెను కట్టేశాడు. మేత మేస్తున్న క్రమంలో విద్యుత్ తీగ తెడి పడడంతో పాడిగేదె మృత్యువాత పడింది. సుమారు రూ.50వేల విలువ ఉంటుందని బాధిత రైతు శంకర్ పేర్కొన్నాడు. తనను ప్రభుత్వం ఆదుకోవాలని కోరాడు.

భక్తజన సంద్రమైన మల్లన్నపేట

- మల్లన్నకు బోనాలు సమర్పణ



బోనాలతో ప్రదక్షిణ చేస్తున్న భక్తులు

గొల్లపల్లి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): గొల్లపెల్లి మండలం మల్లన్నపేట శ్రీ మల్లికార్జున స్వామి జాతర ఉత్సవాలకు భక్తులు భారీ ఎత్తున తరలి రావడంతో మల్లన్నపేట గ్రామంలోని వీదులన్ని వేలాదిగా తరలివచ్చిన భక్త జనంతో కిటకిటలాడాయి. ఏటా మార్గశిర మాసంలో వచ్చే షష్ఠి ఉత్సవాలలో ఏడు వారాల పాటు మల్లన్నపేట శ్రీ మల్లికార్జున స్వామి ఆలయంలో ఏడు వారాల పాటు ఉత్సవాలు జరుగుతాయి. షష్ఠి ఉత్సవాలలో మొదటి ఆదివారం కావడంతో పాటు సెలవు దినం కావడంతో మల్లన్న జాతరకు భక్తులు అధిక సంఖ్యలో వచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. వేలాది మంది భక్తులు బోనాలు సమర్పించి శ్రీ స్వామి వారికి మొక్కులు చెల్లించుకున్నారు. శ్రీ స్వామి వారికి వివిధ సేవా టికెట్ల ద్వారా లక్షా నాలుగువేల 5 వందల 40 ఆదాయం వచ్చినట్లు ఆలయ కార్యనిర్వహనాదికారి విక్రమ్ తెలిపారు. జాతరకు వేలాది మంది భక్తులు తరలి రావడంతో ధర్మపురి సిఐ రాంనర్సింహ రెడ్డి ఆధ్వర్యంలోని పోలీసు బృందం భారీ బందోబస్తు నిర్వహించింది. వైద్య సిబ్బంది భక్తులకు కావాల్సిన వైద్యం చేశారు. పంచాయతీ రాజ్, అగ్నిమాపక శాఖ సిబ్బంది ఆలయ ఫౌండర్ ట్రస్టీ శాంతయ్య, దేవాదాయ శాఖ సిబ్బంది, స్థానిక జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులు భక్తుల సేవలో తరించారు. ఎస్సైలు ఎం కృష్ణ, సాగర్ రెడ్డి, ఉదయ్ కుమార్, మహేష్, రవీందర్, సుప్రియ లు బందోబస్తు నిర్వహించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరి దుర్మరణం

- మరో ఇద్దరికి తీవ్రగాయాలు
- నగునూర్ వద్ద ఘటన



దూడం రఘురాం(ఫైల్), కొమ్మిడి దేవేందర్‌రెడ్డి(ఫైల్)

కరీంనగర్ క్రైం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): లారీ రూపంలో వచ్చిన మృత్యువు ఇద్దరిని కబలించగా మరో ఇద్దరు చావుబతుకుల్లో కొట్టుమిట్టాడుతున్నారు. కరీంనగర్ శివారులోని నగునూర్- జూబ్లీనగర్ రోడ్డులో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు దుర్మరణం చెందగా మరో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. నగునూర్ గ్రామస్థులు, కరీంనగర్ రూరల్ పోలీసుల వివరాల ప్రకారం.. పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ మండలం సాంబయ్యపల్లికి చెందిన రైతు కొమ్మిడి దేవేందర్‌రెడ్డి(55), ఆయన భార్య హైమావతి కరీంనగర్ రూరల్ మండలం నగునూర్ లోని వారి కూతురు ఇంట్లో జరిగిన మల్లన్న పట్నాల(పండుగ)కు హాజరై స్వగ్రామానికి ద్విచక్రవాహనం(టీఎస్ 22 ఇ 7746)పై బయల్దేరారు. రాత్రి 7:30 గంటల సమయంలో కరీంనగర్ రూరల్ మండలం చామనపల్లికి చెందిన దూడం రఘురాం(31), తుంటి రమేష్ ద్విచక్రవాహనం(టీఎస్ 02ఈపీ 6487)పై నగునూర్ వైపునకు వస్తున్నారు. నగునూర్ పరిధిలోని ఓ వైద్య కళాశాల సమీపంలో రెండు ద్విచక్రవాహనాలు ఎదురెదురుగా ఢీకొనడంతో వాహనాలపై ఉన్న నలుగురు రోడ్డుపై పడిపోయారు. అదే సమయంలో చొప్పదండి ఐకేపీ నుంచి ధాన్యం లోడ్‌తో కరీంనగర్‌కు వస్తున్న లారీ(ఏపీ 25 వీ 9888) అప్పటికే ద్విచక్రవాహనాలు ఢీకొని రోడ్డుపై పడిపోయిన నలుగురి పైనుంచి దూసుకెళ్లింది. ప్రమాదంలో కొమ్మిడి దేవేందర్‌రెడ్డి, దూడం రఘురాం మృతి చెందగా తొంటి రమేష్, దేవేందర్‌రెడ్డి భార్య హైమావతి తీవ్రంగా గాయపడి ఆసుపత్రిలో చికిత్సపొందుతున్నారు. అయితే ద్విచక్రవాహనం లారీని ఓవర్‌టేక్ చేస్తుండగా ఎదురుగా మరో ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టినట్లుగా సమాచారం.

● రెండు గ్రామాల్లో విషాదం

రోడ్డు ప్రమాదంతో సాంబయ్యపల్లి, చామనపల్లి గ్రామాల్లో విషాదం నెలకొంది. పండుగకు అల్లుడి ఇంటికి వచ్చి తిరిగి వెళ్తుండగా రైతు కొమ్మిడి దేవేందర్‌రెడ్డి మృతిచెందగా ఆయన భార్య హైమావతికి తీవ్రగాయాలవడంతో ఆ కుటుంబం తల్లడిల్లుతున్నది. చామనపల్లికి చెందిన దూడెం రఘురాం కరీంనగర్‌లో ఓ ఫైనాన్స్ సంస్థలో ఉద్యోగం చేస్తున్నాడు. రఘురాం మరణించగా ఆయనతోపాటు ద్విచక్ర వాహనంపై ఉన్న స్నేహితుడైన రైతు తొంటి రమేష్‌కు తీవ్రగాయాలవగా వారి కుటుంబాలు రోదిస్తున్నాయి. రోడ్డు ప్రమాద ఘటన తెలుసుకున్న కరీంనగర్ రూరల్ ఏసీపీ జి విజయ్‌కుమార్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. ప్రమాదానికి గల కారణాలను తెలుసుకున్నారు. లారీ డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని కరీంనగర్ రూరల్ సీఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు. మృతదేహాలను కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రి మార్చ్యురీలో భద్రపరిచినట్లు పోలీసులు తెలిపారు.

నాడు కొడుకు.. నేడు తండ్రి..

కరీంనగర్ క్రైం/సుల్తానాబాద్: కన్న కొడుకు ఐదు సంవత్సరాల కిందటే మరణించగా... ఇప్పుడు తండ్రి మరణించడంతో ఆ ఇంట తీవ్ర విషాదం నెలకొంది. నగునూర్ వద్ద ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో సుల్తానాబాద్ మండలం సాంబయ్యపల్లికి చెందిన దేవేందర్‌రెడ్డి, హైమావతి దంపతులకు కొడుకు, కూతురు ఉండగా ఐదేళ్ల కిందట కొడుకు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటనతో షాక్‌కు గురైన దేవేందర్‌రెడ్డి కుటుంబం ఇంకా తేరుకోకముందే దేవేందర్‌రెడ్డి ప్రాణాలను రోడ్డు ప్రమాదం కబళించింది. మరో వైపున హైమావతి తీవ్రంగా గాయపడి ఆసుపత్రిపాలైంది. ఆమె కూతురు, అల్లుడు రోదిస్తుండడం అందరిని కంటతడిపెట్టిస్తున్నది. ఆదివారం ఉదయం సాంబయ్యపల్లి నుంచి కూతురు వద్దకు వచ్చిన దేవేందర్‌రెడ్డి దంపతులను సోమవారం వెళ్లాలని చెప్పినా ఇంటి వద్ద ఆయన తల్లి ఒకరే ఉందంటూ బయల్దేరారని, పావు గంటకే ప్రమాదం జరిగినట్లు సమాచారం అందిందని అల్లుడు మహేందర్, కూతురు రోదించారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు విద్యార్థుల ఎంపిక



ఎంపికైన విద్యార్థులతో పీడీ

రాయికల్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అల్లీపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన తోపారపు అనూష, ఎండీ సనా రాష్ట్రస్థాయి జూనియర్ కబడ్డీ పోటీలకు ఎంపికైనట్లు హెచ్ఎం పొరండ్ల కిరణ్, పీడీ కృష్ణప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. డిసెంబరు 2 నుంచి 4వ తేదీ వరకు నల్గొండ జిల్లాలోని హాలియాలో జరిగే రాష్ట్రస్థాయి జూనియర్ కబడ్డీ పోటీల్లో పాల్గొననున్నట్లు పేర్కొన్నారు. ఎంపికైన విద్యార్థులను ఉపాధ్యాయులు, గ్రామస్థులు అభినందించారు.

దత్తాత్రేయ నవరాత్రోత్సవాల్లో ఘనంగా పూజలు



దత్తాత్రేయస్వామివారికి హారతి ఇస్తున్న అర్చకులు

ధర్మపురి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి క్షేత్రంలో దత్తాత్రేయ స్వామి నవరాత్రోత్సవాల్లో భాగంగా నాలుగోరోజు ఆదివారం ఘనంగా పూజలు నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా మొదట రామలింగేశ్వరస్వామి వారికి రుద్రాభిషేకం నిర్వహించారు. అనంతరం దత్తాత్రేయ స్వామి ఆలయంలో, గోదావరి నదీ తీరాన గల దత్తాత్రేయస్వామి ఆలయాల్లో స్వామి వారలకు పూలతో అలకంరణ చేశారు. వేద బ్రాహ్మణుల మంత్రోచ్చరణల మధ్య అర్చకులు స్వామి వారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిం చారు. ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు స్వామి వారలను దర్శనం చేసుకున్నారు. స్థానిక లక్ష్మీనరసింహ స్వామి వారిని భక్తులు దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్, ధర్మకర్తల మండలి సభ్యులు ఒజ్జల సౌజన్యానరేం దర్, సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్, ఆలయ సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్, పౌరోహితులు, అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

దేశీయ విత్తన ఉత్పత్తికి బీజం



ఏపుగా పెరిగిన దేశీయ వరి వంగడం

సాగు చేసిన దేశీయ వరి విత్తనాలు

సేంద్రియ ఎరువులతో మేలు రకం విత్తనాల ఉత్పత్తి

రామగిరి, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): రసాయనిక ఎరువులు, వాతావరణ కాలుష్యంతో నేలసారం తగ్గిపోతోంది. ఈ క్రమంలో రైతులు క్రమంగా ప్రకృతి వ్యవసాయం వైపు దృష్టి సారిస్తున్నారు. రామగిరి మండలం కల్వచర్ల గ్రామానికి చెందిన యాదగిరి శ్రీనివాస్ రైతులకు దేశీయ వ్యవసాయ విధానాలను, సేంద్రియ ఎరువుల ప్రాధాన్యాన్ని తెలుపుతున్నాడు. అలాగే మేలు రకమైన విత్తనాలను రైతులకు అందిస్తున్నాడు.

● **సాగు చేసిన ప్రత్యేక దేశీయ వరి వంగడాలు**

కులాకర్: గర్భిణులకు సుఖ ప్రసవానికి ఉపయోగపడుతుంది.

పుంగార్: బాలింతలకు అధిక పాలవృద్ధికి దోహదపడుతుంది.

మపిలై సాంబా: యుక్త వయస్సు వారికి వీర్య వృద్ధికి తోడ్పాడుతుంది.

నవారా: మధుమేహ వ్యాధిగ్రస్తులకు వ్యాధి నియంత్రణకు, నివారణకు ఉపయుక్తంగా ఉంటుంది.

బ్లాక్‌రైస్: అన్ని రకాల నల్లబియ్యం రోగ నిరోధక శక్తిని పెంపొందిస్తాయి

శ్రీనివాస్‌కు వ్యవసాయంపై ఉన్న మక్కువ అతడిని వ్యవసాయ విద్య వైపు మళ్లించింది. జగిత్యాలలోని పొలాసలో డిప్లొమా కోర్సు పూర్తి చేసి వ్యవసాయ విస్తరణ అధికారిగా 2011లో ఉద్యోగం సాధించాడు. 2016 నుంచి మేలు రకం విత్తనాలను సేకరించడం ప్రారంభించాడు.

ఖాళీ సమయాల్లో వ్యవసాయ క్షేత్రంలో దేశీయ విధా నంలో వరిసాగు చేపట్టాడు. రెండెకరాల్లో దేశవాళీ విత్తనోత్పత్తి ప్రారంభించి ప్రశంసలందు కున్నాడు. సుభాస్ పాలేకర్ స్ఫూర్తిగా ప్రకృతి వ్యవసాయ విధానం శ్రీనివాస్‌ను ఆకర్షించింది. దేశీయ వరి రకాల ఉత్పత్తికి కృషి చేసినందుకు రైతునేస్తం ఫౌండేషన్ ఉత్తమ రైతు అవార్డును శ్రీనివాస్‌కు అందజేశారు. బహుజన సాహిత్య అకాడమీ ఆధ్వ ర్యంలో తిరుపతిలో జరిగిన కార్యక్రమంలో కర్షక రత్న అవార్డును అందుకున్నారు. ఇటీవల సర్వేజనా సుఖినోభవంతు ఎన్‌జీవో హైదరాబాద్ వారు సేవా స్వర్ణనంది పురస్కారం లభించింది. ప్రస్తుతం ఆదిలాబాద్‌లో ఇన్ సర్వీస్‌లో అగ్రికల్చర్ బీఎస్సీ విద్యను అభ్యసిస్తున్నాడు.

● **ప్యాడీ ఆర్టిస్ట్‌గానూ...**

దేశవాళీ వరి విత్తనాలతో ప్యాడీ ఆర్ట్ విధానాన్ని శ్రీనివాస్ అనుసరించారు. నల్లని వరిని వివిధ రూపాల్లో తీర్చిదిద్దడం ప్యాడీ ఆర్ట్‌గా ప్రాచుర్యం పొందుతున్నాయి. జపాన్‌వంటి దేశాల్లో పాడి ఆర్ట్ పేరున ప్రతి సంవత్సరం ఉత్సవాలు జరుపుకుంటున్నారు. దీన్ని అధ్యయనం చేసి పొలంలో కాలాబట్టి వరి విత్తనంతో గోమాత, అయోధ్య రామమందిరం ఆకారంలో సాగు చేసి శ్రీనివాస్ ప్రత్యేకతను చాటుకున్నాడు.. గత సంవత్సరంలో భారతదేశ పటాన్ని 29 రాష్ట్రాలను తీర్చిదిద్దాడు.

బాల రచయిత సమ్మేళనంలో విద్యార్థినులు

ఎల్లారెడ్డిపేట, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఉత్తర అమెరికా తెలుగు సంఘం(తానా) ప్రపంచ సాహిత్య వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్జాతీయ బాల రచయిత సమ్మేళనంలో ఎల్లారెడ్డిపేట మండలకేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థినులు నేవూరి మీనాక్షి, దివ్యజ్యోతి పాల్గొన్నారని హెచ్ఎం మనోహరాచారి ఆదివారం తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా జరిగిన ఆన్‌లైన్ పోటీల్లో మొత్తం 101 మంది పాల్గొన్నారని పేర్కొన్నారు. అంతర్జాతీయ బాల రచయితల సమ్మేళనంలో పద్య రచన విభాగంలో విద్యార్థినులు మీనాక్షి, దివ్యజ్యోతి పాల్గొన్నారని చెప్పారు.

ప్రమోషన్లలో నాలుగు శాతం రిజర్వేషన్లు అమలు చేయాలి

హుజూరాబాద్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): బీసీ ఈ గ్రూప్‌కు చెందిన ప్రభుత్వ ఉద్యోగులకు ప్రమోషన్లలో 4శాతం రిజర్వేషన్లను అమలుచేయాలని తెలంగాణ ముస్లిం ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మహ్మద్ ముజాహిద్ హుస్సేన్ ఆదివారం అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్థికంగా అన్నిరంగాల్లో వెనుకబడిన ముస్లింలను విద్య, ఉద్యోగాల్లో నాలుగు శాతం రిజర్వేషన్లను అమలు చేయడం జరిగిందన్నారు. ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల ముఖ్యమంత్రులు చొరవ తీసుకొని బీసీ ఈ గ్రూపులో కొనసాగుతున్న వారిని ప్రమోషన్లలో, రిజర్వేషన్లను అమలు చేయడానికి కృషి చేయాలన్నారు.

‘పంచాయతీ’ పోరుకు ‘సహకార’ నాయకులూ అర్హులే

కరీంనగర్ టౌన్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికల ప్రక్రియ ప్రారంభంకావడంతో పల్లెల్లో రోజురోజుకు రాజకీయ వేడి రాజుకుంటోంది. 2023 జనవరి 31న గ్రామపంచాయతీ పాలకవర్గాల పదవీ కాలం ముగియగా ఇప్పటి వరకు ఎన్నికలు నిర్వహించకపోవడంతో ఔత్సాహిక అభ్యర్థులు పోటీ చేసేందుకు ఉవ్విళ్లూరుతున్నారు. దీంతో ఈసారి సర్పంచ్, వార్డుసభ్యుల పదవులకు తీవ్రపోటీ నెలకొంది. మొదటి విడత నామినేషన్ల సంఖ్య భారీగా పెరుగడమే ఇందుకు నిదర్శనం. ‘పంచాయతీ’ ఎన్నికల్లో పోటీచేయాలనే ఆసక్తి ఉన్నప్పటికీ పోటీకి తాము అర్హులమో కాదో తెలియక చాలా గ్రామాల్లో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల (సింగిల్ విండో) చైర్మన్లు, డైరెక్టర్లు, మత్స్య సహకార, గొర్రెల పెంపకందారుల సహకార సంఘాలు, చేనేత సహకార సంఘాలు, సహకార బ్యాంకుల చైర్మన్లు, డైరెక్టర్లు అయోమయానికి గురవుతున్నారు. నిబంధనల ప్రకారం వారందరూ పోటీ చేసేందుకు అర్హులే.

● **15 రోజుల్లోగా రాజీనామా చేయాలి**

సర్పంచ్‌గా గెలిస్తే 15 రోజుల్లో సహకార సంఘాల చైర్మన్ పదవికి రాజీనామా చేయాల్సి ఉంటుంది. లేకపోతే సహకారశాఖ అధికారులే వారి పదవిని రద్దు చేస్తారు. చైర్మన్లు కాకుండా డైరెక్టర్లుగా ఉన్నవారు సర్పంచ్, వార్డుసభ్యులుగా కొనసాగే అవకాశం ఉంటుందని జిల్లా సహకార అధికారి రామానుజాచార్యులు తెలిపారు. గ్రామ సర్పంచ్, సహకార సంఘం చైర్మన్ రెండు పదవుల్లో కొనసాగే వీలుండదన్నారు.

బీడీ కార్మికులకు సంక్షేమ పథకాలు అమలు చేయాలి

- బీడీ కార్మిక సమాఖ్య జాతీయ ప్రధాన కార్యదర్శి కాశీవిశ్వనాథం



సమావేశంలో మాట్లాడుతున్న ప్రధాన కార్యదర్శి కాశీవిశ్వనాథం

వేములవాడ టౌన్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): బీడీ కార్మికులకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని బీడీ కార్మిక సమాఖ్య జాతీయ ప్రధాన కార్యదర్శి ఎస్ కాశీవిశ్వనాథం డిమాండ్ చేశారు. వేములవాడలో ఆదివారం ఏఐటీయూసీ అనుబంధ సంస్థ అయిన ఆల్ ఇండియా బీడీ, సిగార్, టోబాకో వర్కర్స్ ఫెడరేషన్ జాతీయ కౌన్సిల్ ప్రతినిధుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కాశీవిశ్వనాథం మాట్లాడుతూ బీడీ సంక్షేమ శాఖ ద్వారా కార్మికుల పిల్లలకు స్కాలర్‌షిప్, ఇంటి నిర్మాణానికి సహాయం అందించాలని కోరారు. ప్రతీ జిల్లాలో ఈఎస్ఐ హాస్పిటల్, సంచార వైద్యశాల మంజూరు చేయాలన్నారు. ఈపీఎఫ్‌వో ద్వారా కనీస పెన్షన్ ఆరు వేల రూపాయలు, దేశవ్యాప్తంగా వెయ్యి బీడీలకు 300 రూపాయలు వేతనం, ప్రతీనెల బీడీ కార్మికులకు బ్యాంక్ ద్వారా కాకుండా నేరుగా వేతనం చెల్లించాలని కోరారు. నెలలో 26 రోజులు పని ఉండేలా చూడాలని నాణ్యమైన తునికాకు, తాంబాకు కార్మికులకు సరిపడా వేయాలన్నారు. ఈపీఎఫ్‌వోలో ఆధార్‌తో సంబంధం లేకుండా క్లెయిమ్‌లను స్వీకరించాలన్నారు. బీడీ రంగంలోని అన్ని రకాల సమస్యలపై భవిష్యత్తు పోరాటాలు చేయాలని కార్మికులకు సూచించారు. డిసెంబరు నెలలో సేవ్ ఇండియా-సేవ్ బీడీ వర్కర్స్ నినాదంతో చలో ఢిల్లీ ప్రోగ్రామ్ నిర్వహిస్తామని తెలిపారు. సమస్యల పరిష్కారం కోసం కేంద్ర మంత్రులను కలిసి సమస్యలను వివరిస్తామని ఆయన తెలిపారు. సమావేశంలో జాతీయ బీడీ కార్మిక సమాఖ్య నాయకులు నవాబ్, విలాస్, దేవదాస్, రాంబిలస్ శర్మ, నబీందు గారా, శపన్ చందా , కడారి రాములు, అజ్జ వేణు, వడ్డెపెల్లి లక్ష్మణ్, అనసూర్య, రైసుద్దీన్, అసద్ జమాల్ కదేరి, యునస్, సుతారీ రాములు, ఆది రంగారెడ్డి, ముక్రమ్, గోవర్ధన్, లక్ష్మణ్. భానుచందర్, శాంత, గాజుల లింగం, కొక్కుల శాంతా, పండుగ పోచమల్లు, మోహినొద్దీన్, న్యాలపల్లి భారతి, సగున షర్మిల పాల్గొన్నారు.

గోదావరి వద్ద మల్లన్న భక్తుల రద్దీ



గోదావరిలో స్నానాలు చేస్తున్న భక్తులు

ధర్మపురి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి క్షేత్రంలోని గోదావరి నదిలో ఆదివారం మల్లన్న భక్తుల రద్దీ పెరిగింది. సట్టి వారోత్సవాలను పురస్కరించుకుని గోదావరి నదికి భారీగా భక్తులు తరలివచ్చి స్నానాలు చేశారు. ఇక్కడి నుంచి తమ గ్రామాల్లో మల్లన్న పట్నాలు వేసుకునేందుకు డమరకం, త్రిశూలం, ఒగ్గు డోలు చేత పట్టుకుని బయలు దేరారు. పట్నాలు వేసిన మరునాడు వేములవాడ, కొమరవెల్లి, ఓదెల, ఐనవోలు ఆలయాల్లో స్వామి వారలను దర్శనం చేసుకునేందుకు వెళ్లడం ఆనవాయితీగా వస్తోంది.

ఎంపీలు బీసీ బిల్లుపై పార్లమెంట్‌లో ప్రశ్నించాలి



మాట్లాడుతున్న బీసీ సాధికారత ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు పొలాస నరేందర్

వేములవాడ, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): పార్లమెంట్ సమావేశాల్లో బీసీ బిల్లుపై రాష్ట్రానికి చెందిన ఎంపీలు ప్రశ్నిస్తూ పట్టుబట్టాలని, పార్లమెంట్‌ను స్తంభింపజేయాలని బీసీ సాధికారిత ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు పొలాస నరేందర్ అన్నారు. వేములవాడ పట్టణంలోని బీసీ సాధికారిత కార్యాలయంలో ఆదివారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నరేందర్ మాట్లాడుతూ స్థానిక సంస్థల్లో విద్య, ఉపాధి, ఉద్యోగాల్లో 42 శాతం రిజర్వేషన్లను బీసీలకు కల్పిస్తూ రాష్ట్ర ఉభయ సభల్లో ఏకగ్రీవ తీర్మానం చేసిందన్నారు. కేంద్రానికి పంపి తొమ్మిది నెలలు గడిచినా నెలలుగా ఉలుకు పలుకు లేకుండా వ్యవహరిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి బీసీ జేఏసీ నేతలను ఢిల్లీకి తీసుకువెళ్లి ప్రధాన మంత్రిని, రాష్ట్రపతిని కల్పించి బీసీ బిల్లు ఆమోదం కోసం ఒత్తిడి తీసుకురావాలని తెలిపారు. లేనిపక్షంలో అసెంబ్లీనీ, పార్లమెంటును, ముట్టడిస్తామని హెచ్చరించారు. సమావేశంలో బీసీ నేతలు ఇల్లందుల వెంకటేష్, ఉయ్యాల భూమయ్య, చింతలకోటి రామస్వామి, వాసంపెల్లి దేవయ్య, ప్రభాకర్, రాజేశ్ తదితరులు ఉన్నారు.

క్రీడాకారులకు ప్రభుత్వ ప్రోత్సాహం

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

సిరిసిల్ల టౌన్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో క్రీడాకారులకు రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని మినీస్టేడియంలో ఆదివారం 8వ రాష్ట్ర స్థాయి జూనియర్స్ బాలబాలికల వాలీబాల్ క్రీడా పోటీలను విప్ ఆది శ్రీనివాస్ ప్రారంభించారు. పోటీలు డిసెంబరు 2వ తేదీ వరకు జరగనున్నాయి. క్రీడాపోటీల ప్రారంభోత్సవానికి విచ్చేసిన ముఖ్యఅతిథులకు స్వాగతం పలుకుతూ విద్యార్థులు చేసిన సాంస్కృతిక నృత్యాలు ఆకట్టుకున్నాయి. ముఖ్యఅతిథి ఆది శ్రీనివాస్ జ్యోతిప్రజ్వలన చేసి ఒలింపిక్, వాలీబాల్ అసోసియేషన్ జెండాలను ఆవిష్కరించి విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. వేదికపై ఉన్న ముఖ్య అతిథులకు 10 జిల్లాల క్రీడాకారులు మార్చ్ ఫాస్ట్ ద్వారా గౌరవ వందనం సమర్పించారు. ఈసందర్భంగా ఆది శ్రీనివాస్ క్రీడాకారులను ఉద్దేశించి మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ పనులను పూర్తిచేసుకొని శారీర, మానసిక ఉల్లాసం కోసం కబడ్డీ, వాలీబాల్, ఖోఖో లాంటి గ్రామీణ క్రీడలను ఆడేవారన్నారు. కపిల్‌దేవ్ హయాంలో ప్రపంచ కప్ సాధించిన అనంతరం క్రికెట్ వంటి క్రీడలపై మొగ్గు చూపిన గ్రామాల్లో యూత్ క్లబ్‌లు, అసోసియేషన్స్ పెద్దల సహకారంతో కబడ్డీ, వాలీబాల్, ఖోఖో క్రీడలను ప్రోత్సహిస్తున్నారని అన్నారు. వేములవాడలో వాలీబాల్, కబడ్డీ రాష్ట్రస్థాయి పోటీలతో పాటు జాతీయ వాలీబాల్ పోటీలకు ఆతిథ్యం ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. రాష్ట్రంలో క్రీడాకారులకు కొదవలేదని మట్టిలో మాణిక్యాల్లాంటి క్రీడాకారులు ఉన్నారని, వారిని వెలికితీయడానికి క్రీడలను ప్రోత్సహిస్తామని తెలిపారు.

క్రీడలతో మనోవికాసంతో పాటు శారీరక ధారడ్యం పెంపొందుతుందన్నారు. వివిధ జిల్లాల నుంచి వచ్చిన వాలీబాల్ క్రీడాకారులు క్రీడా నైపుణ్యాన్ని ప్రదర్శించి జాతీయస్థాయిలో రాణించాలన్నారు. అనంతరం ముఖ్యఅతిథి ప్రభుత్వ విప్ వాలీబాల్ క్రీడలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వాలీబాల్ అసోసియేషన్ అధ్యక్షుడు గజ్జెల రమేష్‌బాబు, ప్రధాన కార్యదర్శి ఎన్‌వీ హన్మంత్‌రెడ్డి, కోశాధికారి కృష్ణప్రసాద్, ఉమ్మడి జిల్లా ప్రధానకార్యదర్శి గిన్నె లక్ష్మన్, రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు చెన్నమనేని శ్రీకుమార్, ఉపాధ్యక్షుడు చింతకింది శ్యాంకుమార్, లక్ష్మీనారాయణ గౌడ్, ప్రధానకార్యదర్శి ఎ రాందాస్, సహాయ కార్యదర్శులు లక్ష్మణ్, రామస్వామి, రెఫరీ బోర్డు రాష్ట్ర చైర్మన్ గణపతి, కన్వీనర్ రవీందర్‌రెడ్డి, ఎస్‌జీఎఫ్ జిల్లా ప్రధానకార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాష్, ఉపాధ్యక్షుడు బొప్ప దేవన్న, పీసీసీ మాజీ కార్యదర్శి గడ్డం నర్సయ్య, తదితరులు పాల్గొన్నారు.




వాలీబాల్ పోటీలను ప్రారంభిస్తున్న విప్ ఆది శ్రీనివాస్, పోటీలో తలపడతున్న బాలికల జట్లు

వైభవంగా మల్లికార్జునస్వామి కల్యాణం

- పాల్గొన్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



పూజలు నిర్వహిస్తున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

చందుర్తి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): చందుర్తి మండలంలోని నర్సింగాపూర్ గ్రామం మోహినికుంట లక్ష్మీమల్లికార్జున స్వామి ఆలయంలో స్వామి వారి కల్యాణోత్సవం ఘనంగా నిర్వహించారు. కల్యాణోత్సవం సందర్భంగా ఆలయానుబంతి పూలతో అలకరించారు. శ్రీవిశ్వావసు నామ సంవత్స మార్గశిర బహుల దశమి ఆదివారం ఉదయం 11-59ని.లకు స్వామి వారి కళ్యాణోత్సవంను ప్రత్యేక వేదికపై ఉత్సవ మూర్తులను ఆసీనులను చేసి వేద మంత్రోచ్ఛరణల మధ్య కల్యాణాన్ని అంగరంగ వైభవంగా పండితులు సంపత్ కుమార్‌శర్మ నిర్వహించినట్లు ఆలయ వంశపారంపర్య అర్చకులు మూడపల్లి భద్రయ్యశర్మ తెలిపారు. కల్యాణోత్సవంలో వేములవాడ ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు ఆది శ్రీనివాస్‌ను శాలువతో ఘనంగా సత్కరించారు. ఉమ్మడి కరీంనగర్, నిజామాబాద్ జిల్లాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం నిర్వాహకులు అన్నదానం కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు చింతపంటి రామస్వామి, పులి సత్తయ్య, శ్రీమన్ నారాయణ, ఏసుదాసు, ముకుందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు

ఇన్‌స్పైర్ మనాక్ రాష్ట్రస్థాయిలో సత్తాచాటిన విద్యార్థి



ప్రాజెక్ట్‌తో విద్యార్థి బండారి రాకేష్

వేములవాడ టౌన్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): వేములవాడ మండలం రుద్రవరం గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న బండారి రాకేష్ అనే విద్యార్థి ఇన్‌స్పైర్ మనాక్‌లో రాష్ట్రస్థాయికి ఎంపికయ్యాడు. ప్రస్తుతం వయసుతో సంబంధం లేకుండా అందరినీ గుండెపోటు కబలిస్తున్న సందర్భంలో గ్యాస్ట్రిక్, అల్సర్ సంబంధిత సమస్యల లక్షణాలకు, గుండెపోటు లక్షణాలకు ఉన్న కొద్ది పాటు తేడాను గుర్తించకపోవడంవల్ల ఆకస్మిక మరణాలు అరికట్టడానికి పనిచేస్తుంది. ఏ వ్యక్తిలో అయినా హార్ట్ ఎటాక్ కన్నా ఆరు గంటల ముందు నుంచే హార్ట్‌బీట్ అసాధారణ పరిధిని సూచిస్తుంది. ఈ విధానంవల్ల ఐదు, ఆరు గంటల ముందుగా హార్ట్‌బీట్‌లో తేడాను డివైస్ ద్వారా కచ్చితంగా గుర్తించడం ద్వారా సరైన సమయంలో చికిత్స జరిపించి, తక్కువ శ్రమతో ప్రాణాన్ని కాపాడవచ్చని విద్యార్థి బండారి రాకేష్, జీవశాస్త్ర ఉపాధ్యాయురాలు బైరి సౌమ్య సహాయంతో తయారు చేసిన ప్రాజెక్టు రాష్ట్రస్థాయికి ఎంపికైంది. విద్యార్థి రాకేష్ ప్రధానోపాధ్యాయురాలు మేకల మాధవీలత, ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు ఉమామహేష్, ఉపాధ్యాయులు అభినందించారు.

రాష్ట్రస్థాయి వైజ్ఞానిక పోటీలకు ఎంపిక

ఎల్లారెడ్డిపేట: మండలంలోని రాచర్లబొప్పాపూర్ పీఎంశ్రీ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు శ్రావణ్‌తేజ, ఆయాన్ రాష్ట్ర స్థాయి వైజ్ఞానిక ప్రదర్శన పోటీలకు ఎంపికయ్యారని పాఠశాల హెచ్ఎం మధుమాలతి ఆదివారం తెలిపారు. రాజన్నసిరిసిల్ల జిల్లా కేంద్రంలోని నిర్వహించిన జిల్లాస్థాయి పోటీల్లో ప్రతిభ కనబర్చారని పేర్కొన్నారు. ఎంపికైన విద్యార్థులను ఉపాధ్యాయులు, స్థానికులు అభినందించారు.

వేములవాడలో భక్తుల రద్దీ

- ఎల్ఈడీ స్క్రీన్‌పై రాజన్న దర్శనం



స్వామివారి దర్శనానికి బారులు తీరిన భక్తులు

వేములవాడ టౌన్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): వేములవాడలో భక్తుల రద్దీ నెలకొంది. ఆదివారం సెలవుదినం కావడంతో దాదాపు 25 వేలకు పైగా భక్తులు తరలివచ్చి స్వామివారికి మొక్కులు చెల్లించారు. వేలాదిమంది భక్తులు తలనీలాలు సమర్పించారు. కోడెల మొక్కులు చెల్లించారు. ఆలయంలో స్వామివారికి భక్తులు అభిషేక పూజలు చేశారు. నిత్యఅన్నదాన సత్రం పైఅంతస్థులో కల్యాణం, సత్యనారాయణస్వామి వ్రతాలు నిర్వహించారు. స్వామివారికి మహాలింగార్చన, కుంకుమపూజలు, పెద్ద పల్లకీ సేవలు, ఆకుల పూజలు చేసి భక్తిప్రపత్తిని చాటారు. అనంతరం భీమేశ్వరస్వామివారిని దర్శించుకున్నారు. రాజరాజేశ్వరస్వామి వారిని ఎల్ఈడీ స్క్రీన్‌పై దర్శించుకున్నారు. క్యూలైన్, తలనీలాలు, అభిషేకాలు తదితర చోట్ల ఈవో రమాదేవి పరిశీలించారు.

● **వైభవంగా రుద్రాభిషేకం**

గీతా జయంతి ఉత్సవాల సందర్భంగా రాజరాజేశ్వరస్వామి దేవస్థానంలో ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం స్వామివారికి 11మంది రుత్వికులతో మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, నాగిరెడ్డి మండపంలో ఏకాంతంగా పరివార దేవతలకు అర్చనలు, గీతా హోమం నిర్వహించారు. అనుబంధ ఆలయాల్లో అర్చనలు నిర్వహించారు.

● **బద్దిపోచమ్మకు బోనాలు**

భీమేశ్వరస్వామివారిని దర్శించుకున్న భక్తులు బద్దిపోచమ్మకు బోనాలు సమర్పించారు. అమ్మవారి దర్శనానికి రెండు గంటలు పట్టింది.

● **సిద్దిపేట, జగిత్యాల ఎన్నికల అబ్జర్వర్ల పూజలు**

వేములవాడ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం అనుబంధ ఆలయమైన భీమేశ్వర ఆలయంలో స్వామివారిని సిద్దిపేట ఎన్నికల అబ్జర్వర్ హరిత, జగిత్యాల్ ఎన్నికల అబ్జర్వర్ బి రమేష్ దర్శించుకున్నారు. అనంతరం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, స్వామివారికి ఇష్టమైన కోడె మొక్కులు చెల్లించుకున్నారు.

ఘనంగా మల్లన్న బోనాల జాతర

ఇబ్రహీంపట్నం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఇబ్రహీంపట్నం గ్రామ శివారులోని గుట్టపైన గల మల్లికార్జునస్వామి ఆలయంలో యాదవ సంఘం ఆధ్వర్యంలో జాతర ఘనంగా సాగుతోంది. మండలంలోని గోదుర్ గ్రామానికి చెందిన పలువురు యాదవ కులస్థులు, మహిళలు బోనాలతో మల్లన్న దర్శనానికి బయలుదేరి వెళ్లారు. ఈ సందర్భంగా ఒగ్గుడోలు కళాకారులు తమ ఆటపాటలతో సందడి చేస్తూ, మల్లన్న పాటలను ఆలపిస్తూ స్వామిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. మల్లన్న స్వామి కల్యాణాన్ని అంగరంగ వైభవంగా జరిపించి, తంతును పూర్తి చేశారు. సాయంత్రం పలు గ్రామాల నుంచి వచ్చిన భక్తులు మల్లన్నను దర్శించుకుని, తమ కోరికలను వేడుకున్నారు. ఈ వేడుకల్లో యాదవ సభ్యులు, వీడీసీలు, భక్తులు పాల్గొన్నారు.



బోనాలతో బయలుదేరిన భక్తులు

ప్రారంభమైన రెండో విడత నామినేషన్లు



బీర్‌పూర్ మండలంలో నామినేషన్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్



మల్యాలలో సిబ్బందికి సూచనలు చేస్తున్న జడ్పీ సీఈవో

జగిత్యాలరూరల్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) :జగిత్యాల అర్బన్, రూరల్ మండలాల్లోని గ్రామాల్లో ఆదివారం రెండోవిడత ఎన్నికల నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ ప్రారంభమైంది. నేటి నుంచి 2 వ తేదీ వరకు నామినేషన్లను స్వీకరిస్తారు. ఆదివారం జగిత్యాల రూరల్ మండలం లో తొలి రోజు సర్పంచి స్థానాలకు 34 వార్డు సభ్యుల స్థానాల కోసం 36 నామినేషన్లను స్వీకరించినట్లు ఎంపీడీఓ రమాదేవి తెలిపారు.

●జగిత్యాల అర్బన్ మండలంలో సర్పంచి స్థానాలకు 9, వార్డు సభ్యుల స్థానాల కోసం 11 నామినేషన్లను స్వీకరించినట్లు ఎంపీడీఓ విజయలక్ష్మీ తెలిపారు.

రాయికల్ మండలంలో సర్పంచ్‌లకు 36 నామినేషన్లు

●**రాయికల్:** రాయికల్ మండలంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో భాగంగా ఆదివారం సర్పంచ్, వార్డు సభ్యుల స్థానాలకు నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమైంది. సర్పంచ్ స్థానాలకు మొదటి రోజు అల్లీపూర్ గ్రామంలో ముగ్గురు, కుమ్మరిపెల్లి గ్రామంలో ఇద్దరు, శ్రీరాంనగర్‌లో ఐదుగురు, సింగరావుపేటలో ఒకరు నామినేషన్లు వేశారు. ఆలూరులో ఒకరు, రాజనగర్‌లో ఒకరు, వీరాపూర్‌లో ఒకరు నామినేషన్ వేశారు. రామాజీపేటలో ఒకరు, రామారావుపల్లిలో ముగ్గురు, దావన్‌పెల్లిలో ముగ్గురు కట్కాపూర్‌లో ఒకరు, కొత్తపేటలో ఇద్దరు, మూటపెల్లిలో ఒకరు, ఒడ్డెర కాలనీలో ఒకరు నామినేషన్ వేశారు. బోర్నపెల్లిలో ఇద్దరు, మంక్యానాయక్ తండాలో ఒకరు, ఒడ్డెర కాలనీలో ఒకరు నామినేషన్ దాఖలు చేశారు. ఆల్యానాయక్ తండాలో ఒకరు, ధర్మాజీపేటలో ఇద్దరు, కైరిగూడెంలో ఒకరు, తాట్లవాయిలో ఒకరు, ఉప్పుమడుగులో ఒకరు నామినేషన్ వేశారు.

వార్డు స్థానాలకు 42 నామినేషన్లు

వార్డు సభ్యుల స్థానాలకు అల్లీపూర్‌లో ఇద్దరు, కుర్మపల్లిలో ఇద్దరు, శ్రీరాంనగర్‌లో ఇద్దరు, ఆలూరులో ఇద్దరు, రాజనగర్‌లో ముగ్గురు, వీరాపూర్‌లో ఒకరు నామినేషన్ వేశారు. అలాగే రామాజీపేటలో ఒకరు, ఇటిక్యాలలో 8 మంది, వస్తాపూర్‌లో ఒకరు, కొత్తపేటలో ఒకరు, మూటపెల్లిలో ముగ్గురు, ఒడ్డెర కాలనీలో ఒకరు నామినేషన్లు వేశారు. బోర్నపెల్లిలో ఒకరు, చింతలూరులో ఒకరు, మంక్యానాయక్ తండాలో ఇద్దరు, ఒడ్డెలింగాపూర్‌లో ముగ్గురు, ధర్మాజీపేటలో ముగ్గురు, తాట్లవాయిలో ముగ్గురు, అయోధ్యలో ఒకరు నామినేషన్లు వేశారు.

నామినేషన్ కేంద్రాలను పరిశీలించిన ఆర్డీవో

రాయికల్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికలలో భాగంగా సర్పంచ్, వార్డు సభ్యుల స్థానాలకు ఏర్పాటు చేసిన నామినేషన్ కేంద్రాలను ఆదివారం జగిత్యాల ఆర్డీవో మధుసూదన్ పరిశీలించారు. ఈ సందర్భంగా మండలంలోని భూపతిపూర్, అల్లీపూర్, ఉప్పుమడుగు, కొత్తపేట కేంద్రాలను సందర్శించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. వారి వెంట ఎంపీడీవో చిరంజీవి, ఎంపీవో సుష్మా, ఆర్ఐ పద్మయ్య, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

బీర్‌పూర్ మండలంలో 37 నామినేషన్లు

●**బీర్‌పూర్:** బీర్‌పూర్ మండలంలో ఆదివారం సర్పంచ్‌ల ఎన్నికల రెండవవిడత నామినేషన్లు ఆదివారం ప్రారంభం అయ్యాయి. మండలంలో నాలుగు నామినేషన్ కేంద్రాలను ఏర్పాటు చేయగా బీర్‌పూర్ క్లస్టర్‌లో సర్పంచ్-7 వార్డు మెంబర్లుకు-22, కొల్వాయి క్లస్టర్‌లో సర్పంచ్-3 వార్డు సభ్యులు-0, తాళ్ళధర్మారం క్లస్టర్‌లో సర్పంచ్-3 వార్డు సభ్యులకు-7, మంగేళ క్లస్టర్‌లో సర్పంచ్-4 వార్డు సభ్యులకు-1 నామినేషన్లు వచ్చినట్లు ఎంపిడీవో భీమేష్ తెలిపారు. మొదటి రోజు నామినేషన్ల కేంద్రాలను అడిషనల్ కలెక్టర్(లోకల్ బాడీ) రాజగౌడ్ పరిశీలించి ఎలక్షన్ మెటీరియల్ తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిడీవో, నాలుగు నామినేషన్ కేంద్రాల రిటర్నింగ్ అధికారులు తదితరులు ఉన్నారు.

మల్యాల మండలంలో 67 నామినేషన్లు

●**మల్యాల:** మండలంలోని మల్యాల, ముత్యంపేట, తాటిపల్లి, రామన్నపేట, తక్కళ్లపల్లి, రాంపూర్‌లో గల నామినేషన్ల కేంద్రాలలో 19సర్పంచ్ పదవులకు 19, 186వార్డు సభ్యులకు గాను 48 నామినేషన్లు దాఖలు అయినట్లు ఎంపీడీవో స్వాతి తెలిపారు. మండలంలోని ఆరు క్లష్టర్లలో ఏర్పాటు చేసిన నామినేషన్ కేంద్రాలను జడ్పీసీఈవో గౌతం రెడ్డి పరిశీలించారు. రిటర్నింగ్ అధికారులకు పలు సూచనలు చేశారు. ఆయన వెంట జగిత్యాల డిఎస్పీ రఘుచందర్, సీఐ నీలం రవి, ఎస్సై నరేశ్‌కుమార్, ఎంపీడీవో స్వాతి, ఎంపీవో ఆమని ఉన్నారు.

కొడిమ్యాల మండలంలో 74 నామినేషన్లు

●**కొడిమ్యాల:** కొడిమ్యాల మండలంలోని 24 గ్రామ పంచాయతీ లలోని 7నామినేషన్ కేంద్రాలలో మొదటి రోజు ఆదివారం 74మంది అభ్యర్థులు నామినేషన్లను దాఖలు చేసినట్లు సహాయ జిల్లా ఎన్నికల అధికారి ఎంపీడీవో ఇ. స్వరూప తెలిపారు. శారు. సర్పంచ్ పదవికి 33, వార్డు సభ్యత్వ పదవులకు 41మంది నామినేషన్లను అందించారు. కొడి మ్యాల గ్రామ మాజీ సర్పంచ్ ప్రభాకర్‌రెడ్డి నామినేషన్ అధికారులకు అందించారు. సర్పంచ్ అభర్థి తమ అనుచరులతో గ్రామంలోని అంబేద్కర్ విగ్రహం నుండి గ్రామ పంచాయతీ వరకు ఊరేగింపుగా వచ్చి నామినేషన్ దాఖలు చేశారు.

●మండలంలోని తిప్పయ్యపల్లి, కొడిమ్యాల, కొండాపూర్, తిర్మాలాపూర్, నాచుపల్లి గ్రామాల్లో నామినేషన్ కేంద్రాలను డీఆర్‌డీఏ ఏపీడీ మదన్‌మోహన్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఏపీడీ మాట్లాడుతూ గ్రామాలలో నాయకుల నుండి స్వీకరిస్తున్న నామినేషన్ పత్రాలను సరిగా చూసుకోవాలన్నారు. నామినేషన్‌కు సంబంధించిన సూచనలు సిబ్బందికి సూచించారు. ఏపీడీ వెంట ఎంపీడీవో స్వరూప, ఎంపీవో భగవాన్‌రెడ్డి, ఆయా గ్రామల కార్యదర్శులు ఉన్నారు.

●మండల కేంద్రంలోని, మండలంలోని కొండాపూర్ గ్రామాల్లోని గ్రామ పంచాయతీ ఎన్నికల నామినేషన్ కేంద్రాలను ఆదివారం జనరల్ ఆబ్జర్వర్ రమేష్ పరిశీలించారు. నామినేషన్ వేయడానికి వచ్చిన వారికి సహకారం అందించాలన్నారు. కేంద్రాలలో నామినేషన్ పత్రాలను, పరిశీలించి ఏర్పాట్లపై సంతృప్తిని వ్యక్తం చేసారు. అబ్జర్వర్ వెంట ఎంపీడీవో స్వరూప ఉన్నారు.

ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు



కోరుట్ల మండలంలో ఎన్నికల సామగ్రిని సిద్ధం చేస్తున్న అధికారులు

కోరుట్ల రూరల్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : మండలంలో గ్రామ సర్పంచ్ వార్డు సభ్యుల ఏర్పాటుకు ఎంపీడీఓ రామకృష్ణ ఆద్వర్యంలో సిబ్బంది ఏర్పాట్లను చేస్తున్నారు. మండలంలోని 15 గ్రామ పంచాయితీలు ఉండంగా సర్పంచ్ వార్డు సభ్యుల ఎన్నికల కొరకు సామాగ్రిని అధికారులు ఏర్పాటు చేస్తున్నారు. 15 గ్రామ సర్పంచ్, 152 వార్డు సభ్యుల ఎన్నిక కొరకు కౌంటింగ్ సామాగ్రితో పాటు ఎన్నికలకు అవసరం అయ్యే పరికరాలను ఏర్పాటు చేసున్నారు. మండలంలోని 15 గ్రామాలలో 31,243 మంది ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకునే విధంగా ఏర్పాట్లను అధికారులు చేస్తున్నారు.

మల్లాపూర్‌కు చేరిన ఎన్నికల సామగ్రి

మల్లాపూర్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : ఎన్నికల పోలింగ్ సామగ్రి ఆదివారం ఎంపీడీవో కార్లాయానికి చేరుకుంది. సంబంధించిన పంచాయతీ కార్యదర్శులు, కారోబార్లు పోలింగి సామాగ్రిని వేర్వేరు చేస్తూ ఒక సేట్‌గా తయారు చేసుకున్నారు. సామాగ్రిని అధికారులు పరిశీలించి పలు సూచనలు చేశారు.

ఏకగ్రీవం కానున్న 38 వార్డులు

మల్లాపూర్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : మల్లాపూర్ మండలంలో 23 గ్రామ పంచాయతీల సర్పంచ్, 220 వార్డు సభ్యుల ఎన్నికలకు నామినేన్ల ప్రక్రియ ముగిసింది. రత్నాపూర్‌లో సర్పంచ్ పదవికి గాను ముగ్గురు, ముత్యంపేటలో 19 మంది ఆశవాహులు నామినేషన్ దాఖలు చేశారు. 220 వార్డుల్లో 38 స్థానాలకు ఒక్కొక్కటి చొప్పున నామినేషన్లు సమర్పించారు. దీంట్లో వాల్గొండ తండాలో గల ఆరు వార్డులకు గాను ఒకటి చొప్పున నామినేషన్ దాఖలు అయ్యాయి. అధికారులు ఆరు వార్డులు ఏకగ్రీవం అని ప్రకటించాల్సి ఉంది. మిగతా 182 వార్డులకే ఎన్నికలు జరుగనున్నాయి. ఇక్కడ సర్పంచ్ పదవికి మాత్రమే ఎన్నిక నిర్వహించనున్నారు.

ధర్మపురి మండలంలో ఎనిమిది నామినేషన్ స్వీకరణ కేంద్రాలు

ధర్మపురి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి మండలంలో మూడో విడత జరిగే 25 సర్పంచ్, 224 వార్డు సభ్యుల స్థానాల కోసం ఎనిమిది గ్రామపంచాయతీల్లో నామినేషన్ల స్వీకరణ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఇందులో నేరెళ్ల గ్రామపంచాయితీలో ఏర్పాటు చేసే కేంద్రంలో నేరెళ్ల, గోవింద్‌పల్లె, ఆకుసాయిపల్లె నుండి పోటీ చేసే అభ్యర్థుల నామినేషన్లు స్వీకరిస్తారు. తుమ్మెనాల కేంద్రంలో తుమ్మెనాల, బురుదేశిపల్లె, నర్సయ్యపల్లె నుండి పోటీ చేసే అభ్యర్థుల నామినేషన్లు స్వీకరిస్తారు. పెద్దనక్కలపేట కేంద్రంలో పెద్దనక్కలపేట, బోదరినక్కలచెరువు గూడెం, దుబ్బలగూడెంకు చెందిన అభ్యర్థుల నామినేషన్లు స్వీకరిస్తారు. దొనూర్ కేంద్రంలో దొనూర్, గాదెపల్లి, తీగలధర్మారం, కొసునూర్‌పల్లె అభ్యర్థుల నామినేషన్లు స్వీకరిస్తారు. దొంతాపూర్ కేంద్రంలో ఆరెపల్లి, దొంతాపూర్, మగ్గిడి-ఎడపల్లి అభ్యర్థుల నామినేషన్లు స్వీకరిస్తారు. రాజారం కేంద్రంలో రాజారం, దమ్మన్నపేట, జైనా అభ్యర్థులకు చెందిన నామినేషన్లు స్వీకరిస్తారు. కమలాపూర్ కేంద్రంలో కమలాపూర్, నాగారం, రామయ్యపల్లె అభ్యర్థుల నామినేషన్లు స్వీకరిస్తారు. తిమ్మాపూర్ కేంద్రంలో రాయపట్నం, తిమ్మాపూర్, బూరుగుపల్లె అభ్యర్థుల నుండి నామినేషన్లు స్వీకరించేలా జగిత్యాల జిల్లా అసిస్టెంట్ ఎన్నికల అధికారి, ఇంచార్జ్ ఎంపీడీవో నరేషకుమార్ ఏర్పాట్లు చేశారు.

ఆపదలో అండగా నిలిచిన మిత్రులు

-బాధిత కుటుంబానికి రూ.25 వేలు ఆర్థిక సాయం

వెల్గటూర్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): చిన్నతనంలో తమతో కలిసి చదువుకొన్న మిత్రుడు మృతి చెందంతో ఆ కుటుంబానికి ఆపద సమయంలో మేమున్నాం అంటూ అండగా నిలిచారు చిన్ననాటి స్నేహితులు. కోటిలింగాలకు చెందిన మానుక సతీష్ అనే యువకుడు ఇటీవల మృతి చెందగా కుటుంబం వీధిన పడ్డట్లైంది. మిత్రుడి మరణ వార్త విన్న పదో తరగతి స్నేహితులంతా ఏకమయ్యారు. పదవ తరగతి వరకు చదువుకున్న మిత్రులంతా కలిసి రూ.25 వేలు సేకరించి ఆ కుటుంబానికి ఆదివారం ఆపన్న హస్తం అందించారు. కార్యక్రమంలో రాపాక మహేందర్, అంకం రాకేష్, జనార్దన్, సంతోష్ చారి, నరేష్, అరుణ్, నాగరాజు, తిరుపతి, వెంకటేష్, సతీష్ శ్రీనివాస్, స్వామి, శంకర్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ప్రధాని 'మన్ కీ బాత్'ను వీక్షించాలి

●బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు దామెర రాంసుధాకర్‌రావు



మన్ కీ బాత్ కార్యక్రమాన్ని వీక్షిస్తున్న బీజేపీ నాయకులు

ధర్మపురి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ మన్ కీ బాత్ కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరు వీక్షించాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దామెర రాంసుధాకర్‌రావు అన్నారు. ధర్మపురి మండలంలోని రాజారం గ్రామంలో బీజేపీ మండల కార్యదర్శి రంగు శ్రీధర్ నివాసంలో ప్రధాని నరేంద్ర మోడీ 128 వ మన్ కీ బాత్ కార్యక్రమాన్ని బీజేపీ కార్యకర్తలతో కలిసి ఆదివారం ఆయన వీక్షించారు. ఈ సందర్భంగా రాంసుధాకర్‌రావు మాట్లాడుతూ మన్ కీ బాత్ కార్యక్రమాన్ని వీక్షించి ప్రధాని అడుగు బాటలో నడవాలని ఆయన కోరారు. దేశంలోని వివిధ రాష్ట్రాల్లో జరిగే గ్రామ స్థాయి నుండి పట్టణ వరకు జరిగే దేశానికి ఉపయోగపడే ప్రయోజనాల గురించి వివరించారు. జీ 20 సమావేశాల్లో జపాన్ ప్రధాన మంత్రికి తెలంగాణ కరీంనగర్ కళాకారులు తయారు చేసిన వెండి బుద్ధుడి విగ్రహాన్ని, ఇటలీ ప్రధాన మంత్రికి వెండి పూల డిజైన్‌తో కూడిన అద్దాన్ని అందించడం జరిగిందని ఆయన పేర్కొన్నారు. కళలకు, కళాకారులకు నిలయంగా నిలిచిన తెలంగాణ కరీంనగర్ చరిత్రను ఈ ఘట్టం మలుపు తిప్పుతుందని ఆయన తెలిపారు. తెలంగాణ కరీంనగర్ కళాకారుల చేతుల్లో రూపు దిద్దుకున్న కళాఖండాలు దేశీయంగానే కాకుండా ప్రపంచం వేదికలపై సమోన్నతి అందుకుంటాయని ఆయన ఆశించారు. తెలంగాణ కళాకారుల కళలను గుర్తించిన ప్రధాని నరేంద్ర మోడీకి ఆయన ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షులు గాజు భాస్కర్, జిల్లా కార్యదర్శి బెజ్జారపు లవణ్, మండల నాయకులు నల్లవెల్లి సృజన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి కామెర ప్రభాకర్, కార్యదర్శి రంగు శ్రీధర్, మండల, పట్టణ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

అప్రమత్తతే శ్రీరామరక్ష

●ఎయిడ్స్‌పై కరువైన అవగాహన
●నేడు ప్రపంచ ఎయిడ్స్ నివారణ దినం

జగిత్యాల అర్బన్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఎయిడ్స్ వ్యాధిపై అప్రమత్తంగా ఉంటే నియంత్రించవచ్చని వైద్యులు సూచిస్తున్నారు. ఎయిడ్స్ మహమ్మారి ప్రచార లోపం అవగాన రాహిత్యం వల్ల మెల్లగా జగిత్యాల జిల్లాలో కేసులు పెరుగుతున్నాయి. డిసెంబరు1 ప్రపంచ ఎయిడ్స్ నివారణ దినం సందర్భంగా ప్రత్యేక కథనం. జిల్లా వ్యాప్తంగా మొత్తం 4,578మంది వ్యాధిగ్రస్థులు ఉన్నట్లు జిల్లా ఏఆర్‌టి సెంటర్‌లో నమోదు అయింది. ఐదు సంవత్సరాల క్రితం వరకు జిల్లాలో తగ్గుతూ వచ్చిన కేసులు ప్రస్తుతం పెరుగుతున్నాయి. జిల్లాలో 2020లో 3,624 కేసులు ఉండగా 2021లో 3,797, 2022లో 4,001, 2023లో 4,204, 2024లో 4,400 కాగా ఈ సంవత్సరం 4,578 కేసులు ఉన్నాయి. ఇవి ప్రభుత్వ ఆసుపత్రిలో నిర్వహిస్తున్న ఏఆర్‌టి సెంటర్‌లో నమోదు అయినవే కావడం గమనార్హం.



జగిత్యాలలోని ఏఆర్‌టి సెంటర్

అందని ఆసరా...

బాధితుల కోసం రాష్ట్ర ప్రభుత్వం ఆసరా పథకం క్రింద ప్రతి నెలా 2 వేలా రూపాయల పెన్షన్ ఇస్తుండగా జిల్లాలో అందడం లేదు. జిల్లా వ్యాప్తంగా 4,578 మంది బాదితులు ఉండగా వారిలో కేవలం 925 మందికి మాత్రమే ఆసరా పెన్షన్‌లు వస్తున్నాయి.

అవగాహనతోనే ఎయిడ్స్ నివారణ

- డాక్టర్ చింత శ్రావణి, ఏఆర్‌టి సెంటర్ ఇన్‌చార్జి



ప్రజల్లో అవగాహన కల్పించడం ద్వారానే ఎయిడ్స్ వ్యాది నివారణ సాధ్యం అవుతుంది. ప్రభుత్వం గతంతో పోల్చితే ఎయిడ్స్ వ్యాది గ్రస్థులకు నాణ్యమైన మందులు అంది స్తున్నది. వైద్యుల సలహా మేరకు సరైన జీవన ప్రమాణాలు పాటిస్తూ మందులు వాడితే సమస్య తీవ్రం కాకుండా ఉండే అవకాశం ఉంటుంది.

మృతుల కుటుంబాలకు పరామర్శ

పెగడపల్లి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : పెగడపల్లి మండలంలో ఇటీవల మృతి చెందిన పలువురి కుటుంబాలను ఆదివారం మాజీ మతిఇ కొప్పుల ఈశ్వర్ పరామర్శించారు. అరవెల్లి , దోమలకుంట, నామాపూర్ గ్రామాలలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన పలువురి కుటుంబాలను పార్టీ రాష్ట్ర నాయకులు ఓరు గంటి రమణారావుతో కలసి పరామ ర్శించారు. ఈ సందర్భంగా వారి వెంట లోక మల్లారెడ్డి, ఉప్పుగండ్ల నరేందర్‌రెడ్డి, ఉప్పులంచ లక్ష్మణ్, కాంతయ్య ఉన్నారు.

జడ్పీ మాజీ చైర్‌పర్సన్ పూజలు

జగిత్యాలరూరల్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : జగిత్యాల రూరల్ మండలంలోని శ్రీ వెంకటేశ్వర ఆలయంలో ఆదివారం నిర్వహించిన సప్త వింశతి వార్షికోత్సవ కళ్యాణంలో మాజీ జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంతసురేష్ పాల్గొని పూజలు నిర్వహించారు. ఈకార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఆనంద్‌రావు, మాజీ ఎంపీటీసీ సునీతలక్ష్మణ్ పాల్గొన్నారు.

యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా

-చూసీచూడనట్లు వ్యవహరిస్తున్న అధికారులు

కోరుట్ల రూరల్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): కోరుట్ల మండలంలో యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా సాగుతోంది. మండలంలోని నాగులపేట, సంగెం, కల్లూర్, పైడిమడుగు గ్రామాలతో పాటు కోరుట్ల పట్టణ శివారులోని వాగు నుండి అక్రమంగా ఇసుకను ట్రాక్టర్ల సహాయం తరలిస్తున్నారు. నాగులపేట గ్రామ శివారులోని సైఫన్ ప్రాంతంతో పాటు కథలాపూర్ మండలంలోని తక్కళ్లపల్లి గ్రామ వాగు నుండి నాగులపేట మీదుగా కోరుట్ల, జగిత్యాల, నిజామాబాద్ జిల్లాలోని ఆర్మూర్ పట్టణాలకు ఇసుకను టిప్పర్లతో అక్రమంగా తరలిస్తున్నారు. కలెక్టర్ సత్యప్రసాద్ ఈ మధ్య నాగులపేట సైఫన్‌ను సందర్శించి ఇసుక అక్రమ రవాణాపై ఆరా తీసారు. అక్రమంగా ఇసుక తరలిస్తున్న వాహనాలు సీజ్ చేయాలని ఆదేశాలు జారీ చేశారు. దీంతో కొన్ని రోజులు ఆగిన ఇసుక అక్రమ రవాణా మళ్లీ మొదలైంది.

●టిప్పర్ల సహాయంతో ఇతర జిల్లాలకు..

కోరుట్ల మండలంలోని నాగులపేట, కథలాపూర్ మండలం తక్కలపల్లి గ్రామాల నుంచి కోరుట్ల పట్టణంలో మీదుగా నిజామాబాద్ జిల్లాలోని ఆర్మూర్‌తో పాటు మెట్‌పల్లి పట్టణాలకు అక్రమా ర్కులు ఇసుకను టిప్పర్ల సహాయంతో తరలిస్తున్నారు. అక్రమార్కులు టిప్పర్లకు ఎస్కార్ట్‌గా కార్లలో ప్రయాణిస్తూ అనుమానం వచ్చినప్పుడు వాటిని దారి మళ్లిస్తున్నట్లు సమాచారం. కొద్ది రోజుల క్రితం కోరుట్ల పట్టణంలోని వేములవాడ రోడ్డులో ఇసుక వాహనానికి ఎస్కార్ట్‌గా వెళ్తున్న కారు అధిక వేగంతో రోడ్డు పక్కన ఉన్న షెడ్‌ను ఢీకొని హోటల్‌లోని దూసుకుపోయింది. రాత్రింబవళ్లు ఇసుక అక్రమ రవాణాతో రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. కోరుట్ల పట్టణంలోని బోమ్మన రోడ్డులో మూడు నెలల నుంచి పలు మార్లు రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకొని పలువురు తీవ్రగాయాలు పాలు కాగా ఇద్దరు మృతి చెందారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.



కోరుట్లలో టిప్పర్‌లో తరలుతున్న ఇసుక

అక్రమంగా ఇసుక తరలిస్తే చర్యలు

- తహసీల్దార్ కృష్ణ చైతన్య



అనుమతి లేకుండా ఇసుక తరలిస్తే చట్టపరమైన చర్యలు తప్పవు. అక్రమంగా ఇసుక తరలింపు నివారణకు ఆర్ఐ స్థాయి అధికారులు రెవెన్యూ సిబ్బందితో టీంలుగా ఏర్పడి పర్యవేక్షిస్తున్నాం. వ్యవసాయం కొరకు కొనుగోలు చేసని ట్రాక్టర్లతో ఇసుక తరలిస్తే చర్యలను తీసుకుంటాం. ప్రతి రోజు ఇసుక అక్రమంగా తరలిస్తున్న వాహనాలను గుర్తించి జరిమానాలను విధిస్తున్నాం.

ద్విచక్ర వాహనం అదుపు తప్పి ఉపాధ్యాయుడికి గాయాలు

కోరుట్ల, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సీఐ కార్యాలయ సమీపంలో ద్విచక్రవాహనం అదుపుతప్పి ఓ ప్రభుత్వ ఉపాధ్యాయుడికి తీవ్ర గాయాలయ్యాయి. పట్టణంలోని ఆదర్శన గర్ ప్రాంతానికి చెందిన నాగుల భరత్ తన ద్విచక్రవాహనంపై వేంకటేశ్వర దేవాలయం వైపు వెళ్తున్నాడు. ఈ క్రమంలో సీఐ కార్యాలయ వద్ద ఏర్పాటు చేసిన స్పీడ్ బ్రేకర్‌ను గమనించకపోవడంతో ద్విచక్రవాహనం అదుపు తప్పి కింద పడిపోగా తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన పోలీసులు, స్థానికులు ప్రత్యేక వాహనంలో ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో చికిత్స నిమిత్తం బంధువులు కరీంనగర్ అసుప్రతికి తరలించారు.

త్రుటిలో తప్పిన పెను ప్రమాదం

కోరుట్ల, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వేములవాడ రహదారిలో త్రుటిలో ప్రమాదం తప్పింది. ప్యాసింజర్లను దింపిన ఆటో ముందుకు వెలుతున్న క్రమంలో అదుపు తప్పి రోడ్డుపై బోల్తా పడింది. దీంతో ఆటో డ్రైవర్‌కు తీవ్రగాయాలయ్యాయి. అప్పడే ప్యాజింగ్‌ను దింపి మందుకు వెళ్తున్న క్రమంలో ప్రమాదం చోటు చేసుకుంది. ఆటోలో అప్పటి వరకు నలుగురు ప్రయాణికులు ఉన్నారు.

తొలి విడత నామినేషన్ల పరిశీలన పూర్తి



వేంపేటలో అభ్యర్థుల నామినేషన్లను పరిశీలిస్తున్న రిటర్నింగ్ అధికారులు

కోరుట్ల రూరల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ సర్పంచ్ , వార్డు సభ్యుల ఎన్నికల కోసం స్వీకరిస్తున్న నామినేషన్ల పరిశీలన ఆదివారం ముగిసింది. పైడిమడుగు గ్రామంలోని 1వ వార్డుకు 6 నామినేషన్ల్ దాఖలు కాగా ఒక నామినేషన్ తిరస్కరించబడినట్లు ఎన్నికల అధికారులుతెలిపారు. 152 వార్డులకు ఒకటి తిరస్కరణ కాగా 371 మంది బరిలో ఉన్నట్లు అధికారులు తెలిపారు. మండలంలోని 15 గ్రామ పంచాయితి సర్పంచ్ పోటీకి 108 నామినేషన్ల్ రాగా 152 వార్డు సభ్యులకు 371 మంది నామినేషన్ల దాఖలు చేసినట్లు ఎన్నికల అధికారులు తెలిపారు. కాగా నామినేషన్ల విత్‌డ్రా అయిన తరువాత బరిలో ఎంత మంది ఉంటారో వేచి చూడాలి.

●**మెట్‌పల్లి రూరల్:** మెట్‌పల్లి మండలంలో మొదట విడతలో 23 గ్రామాల్లో సర్పంచు బరి కోసం 161, వార్డు మెంబర్లకు 403 నామినేషన్లు అభ్యర్థులు దాఖలు చేశారు. ఇందులో సర్పంచ్ స్థానాలకు 32, వార్డు స్థానాలకు 8 నామినేషన్లు ఆదివారం తిరస్కరణకు గురయ్యాయి. దీంతో సర్పంచ్ స్థానాలకు 129, వార్డు మెంబర్ల స్థానాలకు 395 మంది అర్హులుగా తేలారు. సర్పంచ్, వార్డు మెంబర్ల అభ్యర్థుల నామినేషన్లను తిరస్కరణకు గురైతే సదరు అభ్యర్థి సంబంధిత ఆర్డీవో, సబ్ కలెక్టర్, రిటర్నింగ్ అధికారులకు డిసెంబర్ 1 సాయంత్రం వరకు అప్పీల్ చేసుకునే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. డిసెంబర్ 3న నామినేషన్ల ఉపసంహరణకు గడువు విధించారు. అదే రోజు మధ్యాహ్నం తర్వాత బరిలో నిలిచిన అభ్యర్థుల జాబితాను ప్రకటించి వారికి ఎన్నికల గుర్తులను కేటాయించనున్నారు. డిసెంబర్ 11న ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పోలింగ్ నిర్వహించి అదే రోజు అధికారులు ఫలితాలు ప్రకటించనున్నారు.

●మండలంలోని అల్లూరి సీతారామాజుతండా గ్రామ పంచాయతీలో 290 ఓటర్లు ఉండగా సర్పంచ్ పదవికి 10 మంది అభ్యర్థులు నామినేషన్లు వేశారు. పోటీదారుల సంఖ్య ఎక్కువగా ఉండడంతో బరిలో ఉన్న అభ్యర్థి 50 ఓట్లు సాధిస్తే విజయం సాధించినట్లుగా భావించి అందుకు అభ్యర్థులు గ్రామంలో పావులు కలుపుతున్నారు.

ఆరు నామినేషన్ల తిరస్కరణ

కథలాపూర్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పలు గ్రామాలకు సంబంధించి ఆరు నామినేషన్లు తిరస్కరించామని ఎంపీడీఓ, మండల ఎన్నిక అధికారి శంకర్‌నాయక్ తెలిపారు. తక్కళ్ళపల్లి సర్పంచ్ అభ్యర్థి నల్ల రంజిత్ ఓటరు లిస్టులో పేరు లేకపోవడం వల్ల రిటర్నింగ్ అధికారి ఆనంద్ తిరస్కరించినట్లు చెప్పారు. గంభీర్‌పూర్‌లోని ఓ వార్డులో అభ్యర్థి సంతకం పెట్టకపోవడం, పోసానిపేటలోని 8వ వార్డులో కులం ధృవీకరణ పత్రం లేకపోవడం, దుంపెటలో ఓటరు లిస్టు ప్రకారం నంబర్ వేయకపోవడం, రాజారాం తండాలో అదేవార్డులో ఉన్న ఓటరు ప్రతిపాదించని కారణాలతో రిటర్నింగ్ అధికారులు నామినేషన్లు తిరస్కరించినట్లు చెప్పారు.

●**మల్లాపూర్:** మొదటి విడత పంచాయతీ ఎన్నికల ప్రక్రియలో భాగంగా శనివారం ఏడు క్లస్టర్లలో భారీగా నామినేషన్లను అభ్యర్థులు దాఖలు చేశారు. నిబంధనల ప్రకారం సాయంత్రం ఐదింటికి వరకు వరుసలో ఉన్న అభ్యర్థులకు ఆయా క్లస్టర్లలో లోనికి పంపి గేటు వేశారు. రాత్రి వరకు అభ్యర్థుల నుంచి ఎన్నికల అధికారులు నామినేషన్లను స్వీకరించారు. 23 పంచాయతీల సర్పంచ్‌లకు 180 నామినేషన్ల దాకాలు అయినట్లు ఎంపీడీవో శ్రీకాంత్ తెలిపారు. 220 వార్డులకు గాను 474 నామినేషన్లు దాఖలు అయ్యాయి. వాల్గొండ తండా సర్పంచ్‌కు గాను ఆరుగురు నామినేషన్లను సమర్పించగా వార్డు సభ్యులకు గాను ఒక్కో నామినేషన్ సమర్పించారు.

బాధిత కుటుంబానికి చేయూత

బీర్‌పూర్, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): బీర్‌పూర్ మండలంలోని తుంగూర్ గ్రామానికి చెందిన బొమ్మిడి తిరుపతి గత ఏడు నెలల క్రితం బ్రెయిన్ స్ట్రోక్ కారణంగా మంచానికే పరిమితమై పోయాడు. విషయం తెలుసుకున్న జగిత్యాల జిల్లా ధర్మపురికి చెందిన సామాజిక సేవకుడు రేణికుంట రమేష్ స్పందించి తిరుపతి వైద్య ఖర్చులకోసం ఆర్థిక సహాయం చేయాలని నవంబరు 4న ఫేస్ బుక్‌లో పోస్టు చేయగా దాతలు స్పందించి తోచిన సహాయాన్ని అందించారు.

దాతలు చేసిన సహాయాన్ని ఆదివారం తిరుపతి భార్య రాజ్యలక్ష్మికి రమేష్ ఆద్వర్యంలో 1లక్ష 13వేల రూపాయలను అందించారు. అందులో కొంత వైద్య కర్చులకు, మగత డబ్బులను బ్యాంక్‌లో జమ చేయించినట్లు తెలిపారు.